సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
ఆదివారం, 22.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 150
పేజీలు: 12 వెల: రూ. 5

## వాహనదారులకు బిగ్ రిలీఫ్



- రెండో వాహనం కొంటే అదనపు ట్యాక్స్ కు బ్రేక్
- ఈ నెల 23 నుంచి వాహన్ లో తెలంగాణ

10

## కాంగ్రెస్‌లో 'జీవన' తరంగాలు

జీవన్ రెడ్డి 25న పార్టీకి గుడ్ బై?



- బుజ్జగించిన మంత్రులు
- తగ్గని సీనియర్ నేత
- తెరపైకి బీజేపీ సంప్రదింపులు

09

రెండు రోజుల క్రితం భార్య.. ఇప్పుడు భర్త


# ఆత్మహత్య

భార్య మరణంతో కుంగిపోయిన ఎస్ఐ

- విమర్శలు తట్టుకోలేక ప్రాణత్యాగం
- రెండు రోజుల్లో రెండు ప్రాణాలు బలి
- కరీంనగర్ ను కలిచి వేసిన విషాదం
- మనస్పర్థలు, ఆరోగ్య సమస్యలు
- దంపతుల మరణానికి కారణలేంటి?
- విమర్శల వలలో చిక్కుకున్న అధికారి..
- మానసిక ఒత్తిడికి బలైన ఎస్ఐ
- తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు

03






శాంతిభద్రతలను కాపాడాల్సిన చేతులు.. తన సొంత ఇంటి గూటిని కాపాడుకోలేకపోయాయి. సమాజంలోని సమస్యలను పరిష్కరించే పోలీసు అధికారి... తన ఇంట్లోని అలజడిని ఆపలేకపోయారు. ఫలితం.. రెండు రోజుల వ్యవధిలోనే ఒకే ఇంట్లో రెండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కరీంనగర్ టూ టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్, ఆయన భార్య దివ్యల ఆత్మహత్య ఉదంతం ఇప్పుడు కన్నీటి ధారగా మిగిలిపోయింది. ఈ విషాదంలో అందరినీ ఊపిరి సలపనివ్వకుండా చేస్తున్న అంశం.. వారిద్దరి కుమారులు. అమ్మ పిలిస్తే పలికేది లేదు.. నాన్న అక్కున చేర్చుకునే స్థితిలో లేదు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ చిన్నారులు ఇప్పుడు అనాథలయ్యారు. అమ్మానాన్నల మధ్య ఏం జరిగిందో కూడా తెలియని వయసులో.. వారు అనుభవిస్తున్న ఈ శూన్యం ఎవరూ పూడ్చలేనిది. అసలు వారి మధ్య ఏం జరిగింది? ఎందుకు ఆత్మహత్యకు దారితీసింది.. ప్రత్యేక కథనం.

## అతి ప్రజాస్వామ్యం

రేవంత్ పట్టుకు మంత్రుల సెటైర్ల సవాల్!

- అంతర్గత ప్రజాస్వామ్యం పేరిట కాంగ్రెస్‌లో క్రమశిక్షణ గీత దాటుతున్న సంకేతాలు
- మంత్రుల మాటల యుద్ధంతో రేవంత్ నాయకత్వానికి సవాళ్లు పెరుగుతున్నాయా?
- కోమటిరెడ్డి కామెంట్స్‌తో హస్తం పార్టీలో కలకలం
- ఎమ్మెల్యేల చిట్ చాట్లు పార్టీకి తలనొప్పిగా మారుతున్నాయా?
- హైకమాండ్ దృష్టికి చేరిన తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత విభేదాలు
- కేబినెట్ విస్తరణ ఊహాగానాలతో అసంతృప్తి మంటలు మరింత పెరుగుతున్నాయా?



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకూ ఏదో ఒక అసంతృప్తి బయటపడుతోంది. అంతా రేవంత్ పెత్తనం అంటూ చెప్పుకుంటూ నోరు పారేసుకుంటూనే ఉన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల అంతర్గత రాజకీయాలు చిచ్చు పెడుతున్నాయి. ఒకరినొకరు కించపర్చుకుంటూ చిట్ చాట్లు చేస్తున్నారు. దానికి అంతర్గత ప్రజాస్వామ్యం అని పేరు పెట్టుకుంటున్నారు.

**రేవంత్ కు గండమేనా..?**

తెలంగాణ కాంగ్రెస్‌లో ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అధికారాన్ని సుస్థిరం చేసుకుంటున్నప్పటికీ, పార్టీలోని అంతర్గత ప్రజాస్వామ్యం ఇప్పుడు అధిష్టానానికి మిగతా 02లో

# కేసీఆరే

సభకు దూరంగా మాటల మాంత్రికుడు
కేసీఆర్ గైర్హాజరీతో బీఆర్ఎస్ బలహీనత బహిర్గతం



# ప్రాబ్లం?!


- కేసీఆర్ లేకపోవడంతో గులాబీ దళం వ్యూహాలు తేలిపోతున్నాయా?
- రేవంత్ ఎదుట కేటీఆర్‌కు కఠిన పరీక్ష
- వార్ వన్ సైడ్‌గా మారిన అసెంబ్లీ పోరు
- కేసీఆర్ గైర్హాజరీని అస్త్రంగా మార్చుకున్న కాంగ్రెస్
- కేటీఆర్ దాడులు.. ప్రభుత్వానికి అవకాశాలుగా మారుతున్నాయా?
- బడ్జెట్ సమావేశాల్లో తడబడుతున్న బీఆర్ఎస్

## అసెంబ్లీలో కాంగ్రెస్ దూకుడు.. డిఫెన్స్‌లోనే బీఆర్ఎస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** బీఆర్ఎస్ కు కేసీఆర్ తోనే కష్టాలు కలిసి నడుస్తున్నాయి. అసెంబ్లీకి కేసీఆర్ హాజరు కాకపోవడం బీఆర్ఎస్ పార్టీకి సమస్యగా మారింది. రేవంత్‌ను ఎదుర్కోవడం కేటీఆర్ అండ్ టీంకు సమస్యగా మారుతోంది.

**గులాబీ దళంలో అయోమయం**

తెలంగాణ శాసనసభలో ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాలు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య తీవ్ర యుద్ధానికి వేదికవుతున్నాయి. అయితే, ఈ పోరాటంలో బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గైర్హాజరీ ఆ పార్టీకి పెద్ద మైనస్‌గా మారింది. కేసీఆర్ సభకు రాకపోవడంతో అధికార పక్షం సంధిస్తున్న విమర్శనాస్త్రాలను తిప్పికొట్టడంలో గులాబీ దళం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతోంది. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో మిగతా 02లో




## బీజేపీ బలం తగ్గుతోందా!

పాలమూరు లోకసభ నియోజకవర్గంలో తగ్గిన ప్రాభవం

- ఏడు నియోజకవర్గాల్లో కనిపించని ఎంపీ నిధుల అభివృద్ధి
- ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నా బీజేపీ అభ్యర్థిని గెలిపించిన ప్రజలు
- ఇప్పటి వరకు ఒక్క నియోజకవర్గంలో కేంద్ర నిధులతో అభివృద్ధి శూన్యం
- ఎంపీ డీకే అరుణ నియోజకవర్గం పర్యటనలకే పరిమితం

10





## 'గరికపాటి' గుడ్డు వివాదం

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను శోభన పెళ్లికొడుకులతో పోల్చిన నర్సింహారావు
- వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు
- వీడియోను పూర్తిగా వినాలని క్లారిటీ ఇచ్చిన గరికపాటి బృందం


10

## తగ్గిన ఐటీ ఉద్యోగాలు

కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

- హైదరాబాద్ ఐటీ రంగంలో ఉద్యోగాల పడిపోవడంపై కేటీఆర్ ఆందోళన
- మూడేళ్లలోనే ఇంతలా దిగజార్చారు..
- 2 సార్లు అంగీకరించిన ప్రభుత్వం
- ఉద్యోగాల తగ్గుదలపై ముదురుతున్న వివాదం


03




## దేశం చూపు.. తెలంగాణ వైపు!

కోటిన్నర కుటుంబాలకు రూ.5 లక్షల రక్షణ కవచం

- దేశానికే దిక్సూచిగా 'ఇందిరమ్మ' పథకం
- సంచలనంగా కుటుంబ ఇన్సూరెన్స్
- రేవంత్ సర్కారు నిర్ణయంపై చర్చ




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** "ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్"కు సంబంధించిన పూర్తి విధివిధానాలింకా రూపొందించలేదు. కేంద్ర పథకం పీఎంజేజేబీవై తెలంగాణ స్కీమ్‌ను కలపగలరా అనే ఆలోచనపై ఇప్పటికెలాంటి స్పష్టతా లేదు. తెలంగాణ ప్రభుత్వ బడ్జెట్‌లో అత్యంత ఆకర్షణీయమైన ప్రకటన 'ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్'. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మిగతా 02లో



## బాబుకు సినీ బాంబు

నంది వర్సెస్ గద్దర్


- గద్దర్ అవార్డు వేడుకల్లో పేలిన తూటాలు
- ఏపీ సీఎం టార్గెట్ గా చిరంజీవి వ్యాఖ్యలు
- అదే స్థాయిలో నారాయణమూర్తి ఫైర్
- అవార్డులను ఆపేసిన బాబు సర్కారు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఏపీలో ఇప్పుడు సినీ ఇండస్ట్రీ బాంబు పేలుతోంది. గత సీఎం జగన్.. ఇండస్ట్రీని పట్టించుకోలేదని అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే ఇండస్ట్రీ జగన్ కు వ్యతిరేకంగా నిలబడింది. అది చంద్రబాబుకు కలిసి వచ్చింది. ఇప్పుడు మళ్లీ అదే తంతు మొదలైంది. చంద్రబాబు కూడా సినీ పరిశ్రమను నిర్లక్ష్యం మిగతా 02లో

## కరీంనగర్ పాలిటిక్స్‌లో హీట్

హుజూరాబాద్‌లో కౌశిక్‌పై తిరుగుబాటు
జగిత్యాలలో జీవన్ రెడ్డి గుడ్ బై?

06



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 22.03.2026
www.mudranews.in | @mudranews



## మద్యం : మోతాదును కట్టడి చేయండి



రోజుకు ఎంత తాగుతున్నామో గమనించాలి. సాధ్యమైనంత వరకు పరిమితికి లోబడి ఉండటం ఆరోగ్యానికి కీలకం.

# కాంగ్రెస్‌లో అతి ప్రజాస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు క్రమశిక్షణారాహిత్యాన్ని ఎత్తిచూపుతున్నాయి.

**హస్తం పార్టీలో చీఫ్ పంచాయితీ**

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో పెను దుమారాన్ని రేపాయి. ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ మాస్ లీడర్ కాదని, ఆయన స్థానంలో జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్ చేస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లు గెలుస్తుందని కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేశాయి. ఒకవైపు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన 99–రోజుల యాక్షన్ ప్లాన్ అమల్లో బిజీగా ఉంటే, కేబినెట్ మంత్రే పీసీసీ మార్పు గురించి బహిరంగంగా మాట్లాడటం రేవంత్ టీమ్‌ను ఆత్మరక్షణలో పడేసింది.

**బీసీ నేతల ఆగ్రహం - సామాజిక సమీకరణాలు**

మహేష్ కుమార్ గౌడ్ బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో, కోమటిరెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు అగ్రవర్ణ వర్సెస్ బీసీ వివాదానికి దారితీశాయి. బీసీ నేత నాయకత్వాన్ని తక్కువ చేయడం అంటే పార్టీ సాధించిన విజయాలను అవమానించడమే అని పలువురు బీసీ కార్పొరేషన్ల ఛైర్మన్లు, నేతలు మండిపడుతున్నారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన విజయం మహేష్ గౌడ్ నాయకత్వంలోనే కదా అని వారు నిలదీస్తున్నారు. ఈ వివాదం చినికి చినికి గాలివానలా మారి చివరకు ఢిల్లీలోని ఏఐసీసీ పెద్దల వరకు చేరింది.

**రేవంత్ రెడ్డి పట్టుకు సవాళ్లు**

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తన పరిపాలనా దక్షతను నిరూపించుకుంటూ, హైకమాండ్ వద్ద తన పలుకుబడిని పెంచుకుంటున్నప్పటికీ, పార్టీలోని సీనియర్లను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఇంకా సవాళ్లు ఎదుర్కొంటున్నారు. మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వంటి అగ్ర నేతలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో వెనక్కి తగ్గిన కోమటిరెడ్డి, తన మాటల వెనుక దురుద్దేశం లేదని, జగ్గారెడ్డిని పొగిడానే తప్ప మహేష్ గౌడ్‌ను కించపరచలేదని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ, కాంగ్రెస్‌లో ఈ బహిరంగ విమర్శల సంస్కృతి పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీస్తోందని ఆ పార్టీ నేతలు ఆవేదన వ్యక్తంమ చేస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండటం మంచిదే అయినప్పటికీ, అది హద్దులు దాటితే ప్రభుత్వ మనుగడకే ప్రమాదమని క్యాడర్ ఆందోళన చెందుతోంది. అసెంబ్లీ సమావేశాల తర్వాత కేబినెట్ విస్తరణ ఉటుందన్న ప్రచారంతో ఇది మరింతగా పెరిగే అవకాశాలే కనిపిస్తున్నాయి.

**ఎమ్మెల్యేల లాబీ చిట్ చాట్లు - రచ్చరచ్చ**

అసెంబ్లీ లాబీల్లో ఎమ్మెల్యేలు మీడియా ప్రతినిధులతో చేస్తున్న ఆఫ్ ద రికార్డ్ చిట్ చాట్లు ఇప్పుడు పార్టీకి పెద్ద శాపంగా మారాయి. మంత్రి పదవుల ఆశావహులు, అసంతృప్త నేతలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం, ప్రభుత్వంపైనే సెటైర్లు వేయడం వంటివి పతాక శీర్షికలకు ఎక్కుతున్నాయి. అనవసర వివాదాలకు దూరంగా ఉండండి, మీడియా ఇంటరాక్షన్లలో జాగ్రత్తగా ఉండండి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హెచ్చరించినా, ఎమ్మెల్యేలు మాత్రం తమ స్వేచ్ఛా ధోరణిని వీడటం లేదు. ఈ అలవోక మాటలే ప్రత్యర్థి పార్టీలకు బలమైన అస్త్రాలుగా మారుతున్నాయి.

# కేసీఆరే ప్రాబ్లం!?

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో పరిస్థితి వార్ వన్ సైడ్ అన్నట్లుగా మారుతోంది.

**తేలిపోతున్న ప్రతిపక్ష పోరాటం**

శాసనసభలో బీఆర్ఎస్ తరపున వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు గళం విప్పుతున్నప్పటికీ, కేసీఆర్ మార్క్ వ్యూహచతురత లోపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కీలకమైన బడ్జెట్ చర్చలు, గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం వంటి సందర్భాల్లో కేసీఆర్ ఉండి ఉంటే సభలో చర్చ మరో స్థాయిలో ఉండేది. కేసీఆర్ లేని లోటును రేవంత్ రెడ్డి అనుకూలంగా మార్చుకుంటున్నారు. 'ప్రజలు అధికారం ఇచ్చినా బాధ్యతగా సభకు రాని నేత అంటూ రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై చేస్తున్న దాడులు ప్రజల్లోకి బలంగా వెళ్తున్నాయి.

**కేటీఆర్ వ్యూహాత్మక తప్పిదాలు**

అసెంబ్లీలో కేటీఆర్ చేస్తున్న కొన్ని సవాళ్లు, విమర్శలు అనూహ్యంగా ప్రభుత్వానికే మేలు చేస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఆరు గ్యారెంటీలు, నిరుద్యోగ భృతి వంటి అంశాలపై కేటీఆర్ దూకుడుగా విమర్శిస్తున్న సమయంలో.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాత ప్రభుత్వ వైఫల్యాలను సాక్ష్యాధారాలతో బయటపెడుతోంది. కేటీఆర్ వేసే ప్రశ్నలకు రేవంత్ రెడ్డి ఎదురుదాడి చేస్తూ, బీఆర్ఎస్ హయాంలో జరిగిన లోపాలను ఎండగడుతున్నారు. దీంతో చర్చ బీఆర్ఎస్ అనుకూలంగా ఉండాల్సింది పోయి, తిరిగి వారి పాత పాలనపై విమర్శలకే పరిమితమవుతోంది.

**వ్యూహాత్మక అస్త్రంగా కేసీఆర్ గైర్హాజరీ**

కేసీఆర్ సభకు రాకపోవడాన్ని కాంగ్రెస్ ఒక బలమైన రాజకీయ అస్త్రంగా వాడుకుంటోంది. కేసీఆర్ జీతం, అలవెన్సుల రూపంలో కోటి రూపాయలకు పైగా ప్రజాధనాన్ని పొందుతున్నారని, కానీ సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటం లేదని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శిస్తున్నారు. రాజరిక ధోరణులు ఇంకా పోలేదు అంటూ ఆయన చేస్తున్న వ్యాఖ్యలు బీఆర్ఎస్ క్యాడర్‌లో ఆందోళన కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ అసెంబ్లీ పోరాటానికి మళ్లీ ఆ పాత ఊపు రావాలంటే కేసీఆర్ సభలో అడుగుపెట్టడం ఒక్కటే మార్గమని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

**రేవంత్‌కు కేసీఆరే కరెక్ట్**

రేవంత్ రెడ్డి వంటి వాగ్ధాటి కలిగిన నేతను ఢీకొనాలన్నా, సభలో చర్చను తమ అజెండా వైపు తిప్పుకోవాలన్నా కేసీఆర్ అనుభవం పార్టీకి అత్యవసరం. కేసీఆర్ రంగంలోకి దిగితే తప్ప, అసెంబ్లీలో కాంగ్రెస్ ఏకపక్ష దూకుడుకు అడ్డుకట్ట వేయడం కేటీఆర్, హరీష్ రావులకు కష్టతరంగానే కనిపిస్తోంది. ప్రస్తుతానికి మాత్రం అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి హవా కొనసాగుతుండగా, బీఆర్ఎస్ పట్టుకోసం పరితపిస్తోంది.



# దేశం చూపు.. తెలంగాణ వైపు!

(మొదటి పేజీ తరువాయి)

బడ్జెట్ ప్రసంగం ప్రకారం, 2026 జూన్ 2 నుంచి రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పేదలు, మధ్య తరగతి, ధనికులు అనే తేడా లేకుండా అందరికీ ఈ పథకం వర్తిస్తుందనడం వల్ల ఈ హామీ సాధారణ సంక్షేమ పథకాన్ని మించిన రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పథకం కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఒక్కసారిగా ఆర్థికంగా కుంగిపోకుండా రక్షించే సోషల్ సెక్యూరిటీ స్కీం అనొచ్చు.


**తెలంగాణ రాష్ట్రమే మొదటిదా..?**

ఉపముఖ్యమంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పినట్టు తెలంగాణయే దేశంలో మొదటిదా అంటే కాదని చెప్పొచ్చు. ఎందుకంటే నాగాలాండ్ ఇప్పటికే సీఎంఎల్ఐఎస్ (CMLIS) పేరుతో 2024, ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్త కుటుంబ–ఆధారిత బీమా మోడల్‌ను ప్రారంభించింది. ఆ పథకంలో కుటుంబ పోషకుడు మరణించినప్పుడు రూ.2 లక్షల జీవిత బీమా కల్పించింది. అయితే లబ్దిదారుల సంఖ్యాపరంగా చూస్తే కేవలం 2.5 లక్షల కుంటుంబాలు మాత్రమే అంటే తెలంగాణ లబ్దిదారుల్లో అవి కేవలం 2.1 శాతం మాత్రమే.. అందువల్ల తెలంగాణ మొట్టమొదటి రాష్ట్రం కాదు కానీ కోటీ పదిహేను లక్షల కుటుంబాలు లక్ష్యంగా ఇంత పెద్ద స్థాయి పథకం మాత్రమే తెలంగాణ మాత్రమే అని చెప్పొచ్చు.

ఇప్పటికే కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై)తో పోలిస్తే.. పీఎంజేజేబీవై వ్యక్తిగత జీవిత బీమా పథకం. దానిలో ఏదేని కారణంతో బీమా పొందిన వ్యక్తి మరణిస్తే రూ.2 లక్షల కవరేజ్ ఉంటుంది. అందులో చేరేందుకు 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు వారై ఉండాలి. ఈ పథకం బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఖాతా ద్వారా, ప్రతి సంవత్సరం రూ. 436 ప్రీమియం మన బ్యాంకు ఖాతా నుంచి ఆటో–డెబిట్ అవుతోంది. అంటే ఇది అందరికీ అందే సార్వత్రిక పథకం కాదు.. వ్యక్తిగతంగా నమోదు చేసుకుని పథకంలో చేరితేనే వర్తిస్తుంది. తెలంగాణ ప్రకటించిన పథకం మాత్రం మరింత విస్తృతమైంది. ఇది కుటుంబం ఒక యూనిట్‌గా, రూ.5 లక్షలు బీమా కవరేజీ వర్తిస్తుంది. పైగా ప్రభుత్వం దీన్ని సంక్షేమ హామీగా ప్రకటిస్తోంది, ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ తేడా చిన్నది కాదు ఒకరకంగా చెప్పాలంటే ప్రజాసంక్షేమ విధానంలో చాలా పెద్ద ముందడుగు.

**నిధులెలా సాధిస్తారు.. కేంద్ర పథకాన్ని కలుపుకుని ఇస్తారా?**

'ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్'కు సంబంధించిన పూర్తి విధి విధానాలింకా రూపొందించలేదు. కేంద్ర పథకం పీఎంజేజేబీవైతో తెలంగాణ స్కీమ్‌ను కలపగలరా అనే ఆలోచనపై ఇప్పటికెలాంటి స్పష్టతా లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పలు వెసులుబాట్లు పరిశీలించొచ్చు. ఒకటి, రాష్ట్రమే సొంతంగా ఒక గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం నడపడం. రెండోది, పీఎంజేజేబీవైని ఆసరా చేసుకుని దానికి రాష్ట్రం టాప్–అప్ కవరేజ్ ఇవ్వడం. మూడోది, అర్హులైన వారికి పీఎంజేజేబీవై ప్రీమియం రాష్ట్రం చెల్లించి, మిగిలిన వర్గాలకు వేరుగా పథకం అమలుచేయడం. కానీ ఒక సమస్య ఉంది. పీఎంజేజేబీవైలో వయో పరిమితి, బ్యాంక్ ఖాతా, కంటెన్ట్, ఆన్వెల్, రీన్వెల్ వంటి షరతులు ఉన్నాయి. తెలంగాణ బడ్జెట్ ప్రసంగంలో మాత్రం 'అందరికీ' అనే మాట ఉంది. కాబట్టి రాష్ట్రంపై భారం మాత్రం భారీగానే వుండొచ్చు.



**ఇదివరకే ఇలాంటి పథకాలున్నాయా ?**

పేదల కోసం, గ్రామీణ భూమి లేని కుటుంబాల కోసం, అసంఘటిత కార్మికుల కోసం, ప్రమాద బీమా అవసరమున్న వర్గాల కోసం గతంలో ఇలాంటి పథకాలు వచ్చాయి. కానీ "ప్రతి కుటుంబానికి జీవిత బీమా" అనే స్థాయిలో, రాష్ట్రం అధికారికంగా పెద్ద ఎత్తున హామీ ఇవ్వడం మాత్రం తెలంగాణనే మొదటి రాష్ట్రం. అందుకే తెలంగాణ ప్రకటన రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకోనుంది. పైగా కేవలం పేదలకే పరిమితం కాకుండా మధ్యతరగతి, ఎగువ తరగతుల వారికీ బీమా అందించడం సంక్షేమ పథకాల అమలులో ఓ పెద్ద మలుపు.

**ఐదు ప్రధాన సవాళ్లు**

**మొదటిది** కుటుంబ నిర్వచనం– కుటుంబం అంటే ఎవరెవరు?

**రెండోది** కుటుంబ పోషకుడు (bread-winner)గుర్తింపు– ఒక కుటుంబంలో ఇద్దరు సంపాదిస్తే? మహిళే ప్రధాన ఆదాయ వనరు అయితే?

**మూడోది** వయస్సు, రిస్క్, ప్రీమియం భారం వయస్సు పరిమితి లేకుండా పెద్ద ఎత్తున కవరేజ్ ఇస్తే ప్రీమియం ఖర్చు పెరగవచ్చు.

**నాలుగోది** లబ్దిదారుల జాబితా —— లబ్దిదారుల డేటాబేస్ బలంగా లేకపోతే క్లెయిమ్‌ల వద్ద వివాదాలు మొదలవుతాయి.

**ఐదోది** అంతకంటే ముఖ్యమైనది క్లెయిమ్ సెటిల్‌మెంట్ వేగం. ఇప్పటికే ఇలాంటి పథకం అమలవుతున్న నాగాలాండ్‌లో ఎదురవుతున్న ప్రధాన సవాలు.

మొత్తానికి పథకం విజయవంతంగా అమలైతే ఆరోగ్యశ్రీ పథకంతో రాజశేఖర్ రెడ్డికి, రైతు భీమా, రైతు బంధుతో కేసీఆర్‌కి వచ్చిన మంచి గుర్తింపు రేవంత్ రెడ్డికీ వస్తుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం లాగా తెలుగు రాష్ట్రం మరోసారి దేశానికి ఆదర్శంగా నిలవగల స్థాయి ఈ అందరికీ ఉచిత జీవిత బీమా పథకానికుంది. కాబట్టి అవరోధాలు లేకుండా అమలు చేయడంలోనే రేవంత్ సర్కార్ సత్తా నిరూపితమౌతుంది.

# బాబుకు సినీ బాంబు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారంటూ చిరంజీవి సహా పలువురు వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ ప్రభుత్వ గద్దర్ అవార్డ్స్ వేడుకలో మాటల బాంబులు పేలాయి. చిరంజీవి, నారాయణమూర్తి లాంటి వాళ్లు... పక్క రాష్ట్రం ( ఆంధ్రప్రదేశ్) సినిమా పరిశ్రమను పట్టించుకోవడం లేదనడం వివాదంగా మారుతోంది.

**చిరు చిచ్చు**

ఉగాది నాడు... తెలంగాణ చిత్ర పరిశ్రమ అవార్డుల వేడుక 'గద్దర్ అవార్డ్స్' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సీఎం, డిప్యూటీ సీఎం సమక్షంలో జరిగిన ఈ వేడుకకు చిత్ర పరిశ్రమకు చెందిన అతిరథులంతా వచ్చారు. 2025 సంవత్సరం ఉత్తమ చిత్రాలు, నటుల అవార్డులతో పాటు మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డ్ ప్రదానం చేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సంలో చిరంజీవి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. సందర్భమో.. అసందర్భమో తెలీదంటూనే ఆయన చేసిన వ్యాఖ్యలు కాస్త కాక రేపాయి. 'తెలంగాణలో చిత్ర పరిశ్రమను బాగా గుర్తిస్తున్నారు.. పక్క రాష్ట్రమైనటువంటి మరో తెలుగురాష్ట్రం కళాకారుల పట్ల, సినిమాల పట్ల వారిని ఉత్సాహ పరిచే విధా నంలో కొంచం వెనుకంజలో ఉందని భావిస్తున్నాను. సినిమా వాళ్లకి దగ్గరగా ఉండే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గారు దీనిని ఇన్స్పిరేషన్ గా తీసుకుని మరింత ప్రోత్సహిస్తే కనుక బాగుంటుంది.' అంటున్నారు. దీనిపై వెంటనే రియాక్షన్ వచ్చింది. చిరంజీవి స్థాయి వ్యక్తి.. పక్క రాష్ట్రంలో అవార్డుల ఇస్తున్న వేదికపై మాట్లాడటంతో అంతా దీని గురించి మాట్లాడటం మొదలుపెట్టారు.

**వంత పాడిన నారాయణమూర్తి**

చిరంజీవి వ్యాఖ్యలే ఏపీకి కొంచం ఇబ్బందికరంగా మారితే.. మరో నటుడు నారాయణమూర్తి చంద్రబాబు, తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఉనికిని గుర్తించండి.. మీరు కూడా నంది అవార్డులు ఇవ్వండి" అంటూ ఆవేశంగా మాట్లాడారు. ఇద్దరు ముఖ్యమైన నేతలు ఓ రాష్ట్రంలోని అవార్డుల వేదికపై నుంచి మరో రాష్ట్రం గురించి మాట్లాడటం ఆంధ్రప్రదేశ్‌ను ఇరుకున పెట్టినట్లైంది.

**తెలుగు దేశం సోషల్ మీడియా కౌంటర్**

చిరంజీవి వ్యాఖ్యలపై ఎవరూ అధికారికంగా రెస్పాండ్ అవ్వకపోయినా .. తెలుగుదేశంకు అనుకూలంగా ఉండే సోషల్ మీడియా అకౌంట్లలో చిరంజీవి వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం అవుతోంది. వాళ్లు లేవనెత్తుతున్న పాయింట్లు ఏంటంటే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందినటువంటి చిరంజీవి పక్క రాష్ట్రం అంటూ కామెంట్లు చేయడం ఏంటి.. ఆయన ఆంధ్రా వ్యక్తి కాదా అన్న ప్రశ్న వస్తోంది. ఒక రాష్ట్రానికి చెందిన అవార్డుల కార్యక్రమంలో వేరే రాష్ట్రాన్ని బహిరంగంగా అదే వేదికపై పాయింట్ అవుట్ చేయడం సభా మర్యాదేనా..?

చిరంజీవి కేవలం నటుడే కాదు. ఆయనకు ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కూడా ఉన్నాయి. ఏపీ ఇండస్ట్రీ అభివృద్ధికి చిరంజీవి ఏమైనా కృషి చేశారా.. లేదా తన ఫౌండేషన్ ద్వారా ఏమైనా కార్యక్రమాలు చేశారా అని ప్రశ్నిస్తున్నారు.

వైజాగ్‌లో స్టూడియో ఏర్పాటు చేయడం తన డ్రీమ్ అని చిరంజీవి ప్రకటించారు. మరి దానికోసం ఏమైనా ప్రయత్నాలు చేస్తున్నారా..? ఆయనకు ఏపీ ప్రభుత్వం ఏమైనా సహకరించడం లేదా..?

తెలుగు సినిమా ఇండస్ట్రీ అంటే అది హైదరాబాద్ కే సంబంధించినదిగా ఇండస్ట్రీ పెద్దలు వ్యవహరిస్తున్నారు. వాళ్లు ఆంధ్రాలో కనీసం సినిమా కార్యక్రమమైనా చేస్తున్నారా అని నిలదీశారు. కిందటి ప్రభుత్వం లాగా ఏపీలో సినిమా టికెట్ల రేట్లు పెంపు విషయంలో ఎలాంటి అభ్యంతరాలు పెట్టలేదు. ఇండస్ట్రీ నుంచి అడిగిన వెంటనే అన్ని సినిమాలకు రేట్లు పెంచతూ జీవోలు వచ్చాయి.

తెలంగాణలో కొన్ని సినిమాలకు టికెట్లు రేట్లు పెంచకుండా ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా సరే తెలంగాణతో సమానంగా ఇండస్ట్రీకి మేలు చేయడంలో ఏపీ వెనుకబడిందని చిరంజీవి వ్యాఖ్యానించడాన్ని వాళ్లు తప్పు పడుతున్నారు.

**సీఎం టైమ్ ఇచ్చినా కలవలేదు.**

సినిమా ఇండస్ట్రీ వాళ్లపై ఆగ్రహానికి మరో కారణం.. ఏపీలో టీడీపీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావొస్తున్నా ఇండస్ట్రీ నుంచి అధికారికంగా ఎవరూ ఇంతవరకూ సీఎంను కలవలేదు. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఓసారి మీటింగ్‌కు ప్రయత్నించారు. అప్పట్లో కొంతమంది పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఆ తర్వాత సీఎంతో మీటింగ్‌కు కిందటేడాది జూన్‌లో ప్రయత్నాలు జరిగాయి. అయితే హైదరాబాద్‌లో వీరిని కలిసేవిధంగా ఓ ఆదివారం చంద్రబాబు టైమ్ ఇచ్చారు. కానీ కొంతమంది షూటింగ్‌లు ఉన్నాయని రాలేకపోవడంతో ఆ మీటింగ్ జరగలేదు. ఈ విషయాన్ని తెలంగాణ ఎఫ్డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు స్వయంగా చెప్పారు. ఇప్పుడు టీడీపీ అనుకూల సోషల్ మీడియా ఆ వీడియోలను వైరల్ చేస్తున్నారు.

**అసలు గ్యాప్ ఎందుకు వచ్చింది..?**

రాష్ట్ర విభజన తర్వాత 2016లో మూడేళ్లకు నంది అవార్డులు ప్రకటించారు. అయితే ఈ అవార్డుల ఎంపికపై విమర్శలు చెలరేగాయి. అవార్డుల ఎంపిక సక్రమంగా లేదంటూ అప్పటి వైఎస్సార్సీపీ నేత, నటుడు పోసాని కృష్ణమురళి వంటి వారు బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. అవార్డుల ప్రకటన అయితే జరిగింది కానీ.. వాటిని నేరుగా నటులకు అందజేయలేదు. ఉమ్మడి రాష్ట్రంలో సాధారణంగా ప్రతీ ఏడాది ఉగాది నాడు నంది అవార్డులను ప్రదానం జరుగుతుంది. ఒకవేళ ఓ సంవత్సరం ఇవ్వకపోయినా రెండు– మూడేళ్లకు ఓసారి అయినా ఇచ్చేవాళ్లు.. కానీ ఇంతవరకూ ఏపీ విభజన తర్వాత ఒక్కసారి కూడా నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. కారణాలు ఏవైనా కానీ.. ఏపీలో కార్యక్రమం జరగకపోవడం ఓ లోటే.

**ఏపీ ప్రభుత్వం స్పందిస్తుందా..?**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కొంచం ప్రోయాక్టివ్‌గానే ఉండే వ్యక్తి. ఆయనకు సినిమా వాళ్లతో ఉన్న సన్నిహిత సంబంధాలు కూడా అందరికీ తెలిసిందే. ఇప్పుడు చిరంజీవి బహిరంగంగా ఇలాంటి కామెంట్ చేయడంతో ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రిత్వశాఖ స్పందిస్తుందా లేదా అన్నది చూడాలి. చంద్రబాబు నేరుగా రియాక్ట్ కాకపోయినా ఆ శాఖ నుంచి స్పందన వస్తుందేమోనని సినిమా ఇండస్ట్రీ చూస్తోంది. తెలుగు సినిమా రంగంలో స్టార్ హీరోగా ఉన్న పవన్ కల్యాణ్ ఏపీలో ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు వ్యాఖ్యలు చేసిన మెగాస్టార్‌కు ఆయన సోదరుడే. అప్పట్లో ఇండస్ట్రీ విషయంలో ఉన్న గ్యాప్‌ను సరిచేయడానికి పవన్ కల్యాణ్ కూడా ప్రయత్నాలు చేశారు.

# భారత భవిష్యత్‌ను మార్చబోతున్న 13 జిల్లాలు

**ముద్ర డెస్క్ :**

భారత దేశం యొక్క రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్తును దేశంలోని కేవలం 13 జిల్లాల జనాభా స్వరూప స్వభావాలు నిర్ణయించబోతున్నాయి. ఈ 13 జిల్లాల జనాభా 2.80 లక్షల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని, అది భారత్‌లో ఉంటుందా.. వెళ్లిపోతుందా వేరే దేశం అవుతుందా అన్నది నిర్ధారిస్తుంది. ఈ 2.80 లక్షల చదరపు కిలోమీటర్లు 7 రాష్ట్రాలతో కలిసి ఉన్నాయి. ఈ 13 జిల్లాలు అత్యంత కీలకమైన సిలిగుడి కారిడార్ 100 కి.మీ పొడవు. 22 కి.మీ వెడలప్పు ఉన్న ఈ కారిడార్‌కు సమీపంలో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర రాష్ట్రాలకు చెందిన 13 జిల్లాలు రాబోయే పది ఇరవై ఏళ్లలో భారత దేశంపు భాగ్యాన్ని నిర్ధారించడంతోపాటు ఇండియా మ్యాప్ ఎలా ఉంటుందో డిసైడ్ చేస్తుంది.

**సిలిగుడి కారిడార్ కీలకం..**

సిలిగుడి 100 కి.మీ. పొడవు, 22 కి.మీ. వెడల్పు కలిగిన చిమటాగా ఈశాన్య భారతంలోని 7 రాష్ట్రాలను దేశ మిగిలిన భాగంతో కలుపుతుంది. ఈ కారిడార్ సమీపంలో బిహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లోని 13 జిల్లాలు ఉన్నాయి, ఇవి 2.8 లక్ష చ.కి.మీ. విస్తీర్ణాన్ని కలిగి ఉన్నాయి. ఈ ప్రాంతాల జనాభా మార్పులు ఈశాన్య రాష్ట్రాల భవిష్యత్తును, దేశ మ్యాప్ స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తాయి.

**13 జిల్లాలు ఇవే..**


బిహార్‌లోని అరరియా, పూర్ణియా, కటిహార్, కిషన్‌గంజ్ జిల్లాలు 38–68% ముస్లిం జనాభా కలిగి ఉన్నాయి. బంగ్లాదేశ్‌కు సమీపంలో ఉన్నాయి. మొత్తం జనాభాలో బంగ్లాదేశ్ నుంచి వచ్చినవారే ఎక్కువ. ఇక పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, ఉత్తర దినాజ్‌పూర్ కూడా ముస్లిం జనాభా కలిగిన దేశాలే. ఉత్తర బెంగాల్‌కు కీలకం, హిందూ–ముస్లిం సమతుల్యం జార్ఖండ్‌కు చెందిన పాకూరు, గోడ్డా, సాహిబ్‌గంజ్, దుమ్కా, జమతారా, దేవఘర్ గిరిజన జిల్లాలు 44 శాతం ఉన్న వీరి జనాభా ఇప్పుడు 22 శాతానికి పడిపోయింది. ఇక ముస్లిం జనాభా 7 శాతం నుంచి 24 శాతానికి పెరిగింది. ఈ జిల్లాల్లో ముస్లిం జనాభా పెరుగుదల బంగ్లాదేశ్ చొరబాటు, సంఘటనా ప్రభావాలతో ముడిపడి ఉంది.

**చారిత్రక నేపథ్యం**

1946 ముస్లిం లీగ్ తీర్మానం ఈ జిల్లాలను బెంగాల్‌లో కలపాలని డిమాండ్ చేసింది. శ్యామాప్రసాద్ ముఖర్జీ ప్రయత్నాలతో హిందూ బలమైన ప్రాంతాలు బెంగాల్‌లో ఉంచబడ్డాయి. 1956 వరకు ఈ ప్రాంతాల్లో విభజన ఉద్రిక్తతలు కొనసాగాయి. పాకిస్తాన్ 1940 నుంచి ఈ జిల్లాలపై కన్ను పెట్టింది.

**భవిష్యత్ ప్రశ్నార్థకం..**

ఈ 13 జిల్లాల జనాభా మార్పులు ఈశాన్య రాష్ట్రాల భద్రతను, రాజకీయ శక్తిని ప్రభావితం చేస్తాయి. బీజేపీ బలం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రతిపక్ష ఆధిపత్యం పెరిగే అవకాశం. ఇటీవల బిహార్ నేత ప్రకటనలు సిలిగుడి 'నెక్'ను లక్ష్యంగా చేసుకున్నాయి. 2050 నాటికి భారత్ 170 కోట్ల జనాభాకు చేరుకుంటుంది, ఈ ప్రాంతాలు దానిలో కీలక పాత్ర పోషిస్తాయి. జనాభా అసమతుల్యత భారత్‌లో ఉత్తర–దక్షిణ విభేదాలను పెంచుతోంది. ఈశాన్య భద్రతా ప్రణాళికలు, జనాభా నిర్వహణ విధానాలు తప్పనిసరి. రాబోయే జనాభా లెక్కలు ఈ ట్రెండ్‌ను స్పష్టం చేస్తాయి, దేశ ఐక్యత కాపాడటానికి చర్యలు తీసుకోవాలి.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
22.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మద్యం : వారంలో కొన్ని రోజులు పూర్తిగా మానేయండి**

రోజూ తాగడం కాకుండా మధ్యలో "నో-ఆల్కహాల్ డేస్" పెట్టుకోవడం శరీ-రానికి విశ్రాంతి ఇస్తుంది.



# తగ్గిన ఐటీ ఉద్యోగాలు

- **కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రాష్ట్రంలోని ఐటీ రంగంలో భారీగా ఉద్యోగాలు తగ్గుదలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాలు తగ్గాయని ప్రభుత్వం ఒక్క వారంలోనే రెండుసార్లు ఒప్పుకోవడం ఆందోళనకరమైన విషయామని అన్నారు. 2023లో హైదరాబాద్‌లోని ఐటీ రంగంలో 9.46లక్షల ఉద్యోగాలు ఉండేవని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ 2026 నాటికి అవి 9.39 లక్షలకు తగ్గాయని ప్రభుత్వం ఒప్పుకుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మొదట మార్చి 16న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా వెల్లడించారని చెప్పారు. అనంతరం బడ్జెట్ ప్రవేశపెడుతున్న సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారని తెలిపారు. ఐటీ సెక్టార్‌లో గణనీయంగా ఉద్యోగాల తగ్గుదలపై వారం వ్యవధిలోనే ప్రభుత్వం రెండు సార్లు అంగీకరించడం ఆశ్చర్యకరమని కేటీఆర్ అన్నారు. ఐటీ రంగంలో ఈ ఉద్యోగాల తగ్గుదలకు కృత్రిమ మేధస్సు (AI) కారణమా? లేదా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యమా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

MEDIA EDUCATION FOUNDATION INDIA

TUWJ Telangana State Union of Working Journalists

# సోషల్ మీడియాపై 22న జాతీయ సదస్సు

**ముద్ర, హైదరాబాద్ :**

సోషల్ మీడియా మంచీ చెడూ' (సోషల్ మీడియా ఇంపాక్ట్ పాజిటివ్ అండ్ నెగెటివ్) అనే అంశంపై తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఇండియా ( మెఫి) ఆదివారం హైదరాబాదులో ఒక జాతీయ సదస్సును నిర్వహిస్తున్నాయి. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కే విరాహత్ అలీ, మెఫీ మేనేజింగ్ ట్రస్టీ దేవులపల్లి అమర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2729 తేదీలలో విజయవాడలో జరుగనున్న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ)11వ ప్లీనరీ సందర్భంగా ఈ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. న్యూఢిల్లీ కి చెందిన ప్రముఖ వెబ్ సైట్ 'ది వైర్' వ్యవస్థాపక సంపాదకుడు ఎంకే వేణు ముఖ్యఅతిథిగా పాల్గొని కీలకోపన్యాసం చేస్తారు. సీనియర్ జర్నలిస్ట్ ములుగు సోమశేఖర్ అధ్యక్షత వహిస్తారు. సోషల్ మీడియా తీరు, దాని ప్రభావం పై భిన్నమైన భావాలు వ్యక్తం అవుతున్న ప్రస్తుత సమయంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.




# ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్ షేర్ చేసిన ప్రధాని మోదీ

**ముద్ర డెస్క్ :**

ఓ కంటెంట్ క్రియేటర్ చేసిన రీల్‌కు ప్రధాని నరేంద్ర మోదీ స్పందించి దానిని తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడం ఆసక్తికరంగా మారింది. యువరాజ్ దువా అనే ఇన్‌ఫ్లుయెన్సర్ తన తండ్రి చక్కెర ఎక్కువగా తీసుకుంటున్నారని, మోదీ చెబితే తగ్గిస్తారని రీల్‌లో అభ్యర్థించాడు. ఈ వీడియోకు స్పందించిన ప్రధాని, యువరాజ్ తండ్రితో పాటు అందరూ చక్కెర వినియోగం తగ్గించాలని సూచించారు. అధిక చక్కెర వల్ల ఆరోగ్య సమస్యలు, ఊబకాయం ముప్పు పెరుగుతుందని హెచ్చరించారు. ఆరోగ్యకర జీవనశైలికి యోగాను అలవాటు చేసుకోవాలని కూడా తెలిపారు. తన వీడియోను ప్రధాని షేర్ చేయడంతో యువరాజ్ ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది తనకు అనూహ్యమని చెప్పారు. ప్రస్తుతం ఈ రీల్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# పత్తి చేనులో పసికందు..

- **పడేసిన గుర్తు తెలియని వ్యక్తులు**

**ముద్ర డెస్క్ :**



కొమరంభీం జిల్లా ఆసిఫాబాద్, సిర్పూర్ పరిధిలోని కాగజ్‌నగర్ మండలం వల్లగొండ గ్రామపంచాయతీ సీతానగర్ శివారులో పత్తి చేనులో పసికందును గుడ్డలో కట్టి పడేసిన ఘటన కలకలం రేపింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో, శిశువును సురక్షితంగా బయటకు తీసి సంరక్షణలోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, గుర్తుతెలియని వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. ఈ సంఘటన 2026 మార్చి 21న వెలుగులోకి వచ్చింది.

# అవన్నీ కాళేశ్వరం నీళ్లే..

- **ప్రాజెక్టుతో సిద్దిపేట దరిదాపుల్లో కరువు లేదు**
- **మాజీ మంత్రి హరీశ్ రావు**

**ముద్ర, సిద్దిపేట:**



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని హరీష్‌రావు తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో నిన్నటి దాకా రైతులు బయట దళారులకు రూ. 16001700లకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందే ఈ కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే 20 నుంచి 25 శాతం మొక్కజొన్న దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. మన ప్రాంతంలో సన్‌ఫ్లవర్ కూడా బాగా సాగు చేస్తున్నారని.. దానికి కూడా ఈరోజు కొనుగోలు కేంద్రం ప్రారంభించామని హరీశ్‌రావు తెలిపారు. సన్‌ఫ్లవర్‌కు క్వింటాల్‌కు రూ. 7721 మద్దతు ధర ఉందని.. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఆదాయం పొందాలని సూచించారు. సన్‌ఫ్లవర్ తక్కువ కాలంలో పూర్తయ్యే పంట.. దీనివల్ల అధిక ఆదాయంతో పాటు మంచి దిగుబడి కూడా వస్తుందని అన్నారు. పంట మార్పిడికి కూడా ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. రాబోయే రోజుల్లో దీన్ని ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు.

ఈ యాసంగిలో మన సిద్దిపేట ప్రాంతంలో ఇంత మంచి దిగుబడి వస్తుందంటే, ఈ స్థాయిలో పంటలు పండుతున్నాయంటే దానికి ఏకైక కారణం కాళేశ్వరం ప్రాజెక్టే అని హరీష్‌రావు స్పష్టం చేశారు. ఒకప్పుడు సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగి సాగు కేవలం 8 వేల ఎకరాలు మాత్రమే ఉండేది. కానీ ఇవాళ కాళేశ్వరం జలాల పుణ్యమా అని అది పదింతలు పెరిగి ఏకంగా 80 వేల ఎకరాల్లో యాసంగి సాగు జరుగుతోందని తెలిపారు. 2005వ సంవత్సరంలో కరువు వచ్చిన పరిస్థితులు నాకు ఇంకా బాగా గుర్తున్నాయన్నారు. తాగడానికి నీళ్లు లేక, పశువులకు గడ్డి లేక అల్లాడిపోయామని పేర్కొన్నారు. పశువులను బతికించుకోడానికి చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట, నంగునూరులో పశుగ్రాస కేంద్రాలు పెట్టి ఆంధ్రా నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి తెచ్చి రైతులకు సప్లై చేశామని గుర్తుచేశారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక సిద్దిపేట దరిదాపుల్లో కరువు అనే మాటే లేదని తెలిపారు. వానలు పడినా, పడకపోయినా కాలంతో సంబంధం లేకుండా రైతులు రెండు పంటలు పండిస్తూ బంగారం లాంటి దిగుబడులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన మన ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక వరంలా మారిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రాజెక్టు మన ప్రాంత రూపురేఖలను మార్చేసి, వ్యవసాయానికి కొత్త దిశానిర్దేశం చేసిందని పేర్కొన్నారు. రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధరను పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు.



# జర్నలిస్టు సమస్యల పరిష్కారమే ధ్యేయం

- **మార్చి 27 నుంచి ఐ.జే.యూ. ప్లీనరీ సమావేశాలు**
- **విజయవంతం చేయాలని డి.సోమసుందర్ పిలుపు**

**ముద్ర, పాలకొల్లు:**

విజయవాడలో త్వరలో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ 11 వ ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ పిలుపు ఇచ్చారు. ఏపియుడబ్ల్యుజే పశ్చిమగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శనివారం పాలకొల్లు ప్రెస్ క్లబ్ లో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఉదయ భాస్కర్ అధ్యక్షత వహించారు. డి.సోమసుందర్ మాట్లాడుతూ... దేశంలో మీడియా స్థితిగతులను మెరుగు పరచడానికి, వర్కింగ్ జర్నలిస్టుల వృత్తి భద్రత, వేతనాలు, రక్షణ, ఆరోగ్యం, వంటి హక్కుల సాధనకు ఐజేయూ పోరాడుతుందని తెలిపారు. దేశంలో 27 రాష్ట్రాలలో ఐజేయు కు అనుబంధంగా రాష్ట్ర సంఘాలు ఉన్నాయని, దాదాపు ముప్పై వేల మంది జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారని సోమసుందర్ వివరించారు. ఐజేయు జాతీయ 11 వ ప్లీనరీ సమావేశాలు మార్చి 27, 28, 29 తేదీల్లో విజయవాడలో తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగుతున్నాయని, 28 వ తేదీ సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సమావేశాలలో ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని తెలిపారు. దేశం నలుమూలలనుండి హాజరయ్యే దాదాపు మూడు వందలమంది వర్కింగు జర్నలిస్టులు మీడియా సంబంధిత అంశాలపై చర్చిస్తారని, వారు సమావేశంలో పది తీర్మానాలను ఆమోదించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేస్తారని సోమసుందర్ తెలిపారు. ఆతిథ్యానికి మారుపేరైన ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా యూనియన్ కార్యదర్శి గజపతి వరప్రసాద్ మాట్లాడుతూ ఐజేయూ 2 వ ప్లీనరీ 1992 లో విజయవాడలో జరిగిందనీ, తిరిగి ముప్పై నాలుగేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ లో ఐజేయు ప్లీనరీ సమావేశాలు విజయవాడలో జరగడం ఎపియుడబ్ల్యుజే కు గర్వకారణమని అన్నారు.

# స్పీకర్ తీర్పును క్వాష్ చేయాలి

- **దానం నాగేందర్ పార్టీ విషయంపై హైకోర్టును ఆశ్రయించిన ఏలేటి**

**ముద్ర డెస్క్ :**



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ విషయంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దానం పార్టీ మారలేదని ఈ నెల 11న శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ తీర్పును క్వాష్ చేయాలని కోరారు. 2024లో ఎంపీగా దానం నాగేందర్ కాంగ్రెస్ తరపున పోటీ చేశారని, ఎమ్మెల్యేగా నాగేందర్ తీసుకుంటున్న జీతాన్ని వెనక్కి తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై సోమవారం హైకోర్టు విచారణ చేపట్టనుంది.

# తవ్వకాల్లో బయటపడ్డ బాంబు

- **రెండో ప్రపంచ యుద్ధం నాటిదిగా గుర్తింపు**
- **నిర్వీర్యం కోసం ఆర్మీ సాయం కోరిన జార్ఖండ్**

**ముద్ర డెస్క్:**



ఇసుక తవ్వకాల్లో భాగంగా ఓ బాంబు బయటపడటం జార్ఖండ్‌లో కలకలం రేపింది. దాన్ని రెండో ప్రపంచ యుద్ధం కాలం నాటి పేలుడు పదార్థంగా అనుమానిస్తున్నారు. ఆ బాంబును నిర్వీర్యం చేసేందుకు అవసరమైన నైపుణ్యం రాష్ట్రప్రభుత్వానికి చెందిన 'బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్' (బీడీడీఎస్) వద్ద లేకపోవడంతో సైన్యం సాయాన్ని కోరినట్లు అధికారులు తెలిపారు. తూర్పు సింగ్‌భూమ్ జిల్లా బహరాగోడా ప్రాంతంలోని సువర్ణరేఖ నదీ తీరంలో ఇటీవల ఇసుక తవ్వకాలు చేపడుతుండగా.. ఓ పేలని బాంబు బయటపడింది. దీంతో వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆ ప్రాంతాన్ని తమ అధీనంలో తీసుకున్నారు. ఆ వస్తువును సమీపించవద్దని, దానిని కదిలించవద్దని గ్రామస్థులను హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ మాదిరి ఉన్న ఆ బాంబు ఇంకా యాక్టివ్‌గా ఉందని భావిస్తున్నారు. దానిపై ఉన్న గుర్తుల ఆధారంగా.. అమెరికా తయారు చేసిన బాంబు అయి ఉండొచ్చని అంచనా వేశారు.

# కన్నీటి గాధ

- **అనారోగ్యం ఒకవైపు, మనస్పర్థలు మరోవైపు..**
- **రెండు రోజుల క్రితం భార్య.. ఇప్పుడు ఎస్సై ఆత్మహత్య**
- **అనాథలుగా మారిన చిన్నారులు**

**ముద్ర డెస్క్ :**



శాంతి భద్రతలను కాపాడాల్సిన చేతులు.. తన సొంత ఇంటి గూటిని కాపాడుకోలేకపోయాయి. సమాజంలోని సమస్యలను పరిష్కరించే పోలీసు అధికారి, తన ఇంట్లోని అలజడిని ఆపలేకపోయారు. ఫలితం.. రెండు రోజుల వ్యవధిలోనే ఒకే ఇంట్లో రెండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కరీంనగర్ టూ టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్, ఆయన భార్య దివ్యల ఆత్మహత్య ఉదంతం ఇప్పుడు కన్నీటి ధారగా మిగిలిపోయింది.

**మౌనంగా సాగిన మృత్యువు అడుగులు**

2016లో మొదలైన వీరి వైవాహిక బంధం ఎంతో ముచ్చటగా సాగుతుందని అందరూ భావించారు. కానీ, కాలక్రమేణా ఆ ఇంట్లో కష్టాల నీడలు ముసిరాయి. అనారోగ్యం ఒకవైపు, మనస్పర్థలు మరోవైపు వారిని వెంటాడాయి. మార్చి 17న దివ్య తీసుకున్న ఆ ఒక్క నిర్ణయం.. ఆ కుటుంబంలో పెను తుఫానును సృష్టించింది. గన్నేరు పప్పు తిని ఆమె తనువు చాలించడంతో, ఆ గూడు ఒక్కసారిగా చెదిరిపోయింది.

**తట్టుకోలేని మనస్తాపం**

భార్య మరణం చంద్రశేఖర్‌ను కుంగదీయడమే కాకుండా సమాజం నుంచి ఎదురైన విమర్శలు ఆయన్ని మరింత ఒంటరిని చేశాయి. "సరిగ్గా చూసుకోలేదు.. వేధించాడు" అన్న ఆరోపణలు.. బంధువుల ఆగ్రహం ఆయన గుండెపై భారంగా మారాయి. యూనిఫామ్ వేసుకున్న అధికారిగా పది మందికి ధైర్యం చెప్పాల్సిన ఆయన, తనపై వస్తున్న నిందల ముందు నిలబడలేకపోయారు. అంత్యక్రియల వేళ ఎదురైన ఉద్రిక్తతలు, చుట్టుముట్టిన మానసిక ఒత్తిడి ఆయన్ని బలహీనపరిచాయి. "ఒక వైపు భార్య లేదన్న వేదన.. మరోవైపు లోకం వేస్తున్న వేలెత్తి చూపులు.. రెండింటి మధ్య నలిగిపోయిన ఆ మనసు మృత్యువు వైపే మొగ్గు చూపింది."

**దివ్య ఆత్మహత్యతో విమర్శలు..**

కరీంనగర్ జిల్లాలోని ఇల్లందకుంట సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో చంద్రశేఖర్‌తో వివాహం జరిగింది. చంద్రశేఖర్ కుటుంబంతో కలిసి కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటున్నారు. టూ టౌన్ ఎస్సైగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే కడుపు నొప్పితో బాధపడుతున్న దివ్య మంగళవారం(మార్చి 17న)గన్నేరు పువ్వుల రసం తాగింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. తండ్రి చిన్నసమ్మయ్య ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్ఐ చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్య తీవ్ర చర్చనీయాంశమైంది. ఎస్సైపై విమర్శలు వచ్చాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఎస్సై చంద్రశేఖర్ శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు.

**మరో హెచ్చరిక..**

పోలీసుల నిరంతర పని ఒత్తిడి, వ్యక్తిగత జీవితంలో వచ్చే చిక్కుముడులు ఎంతటి ప్రమాదకరంగా మారుతాయో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. వృత్తిపరమైన ఒత్తిడికి తోడు కుటుంబ కలహాలు తోడైతే, అది మనిషిని ఎంతటి దారుణ నిర్ణయానికైనా పురికొల్పుతుంది. కౌన్సెలింగ్ వ్యవస్థలు, మానసిక మద్దతు పోలీసు కుటుంబాలకు ఎంత అవసరమో ఈ మరణాలు గుర్తుచేస్తున్నాయి. చంద్రశేఖర్, దివ్యల మరణం కేవలం ఒక వార్త కాదు.. ఇది సమాజానికి, ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. మనుషుల ప్రాణాలు పోకముందే, వారి మనసులోని బాధను వినే హృదయాలు తోడవ్వాలి.

**ప్రశ్నార్థకంగా మారిన పసిపిల్లల భవిష్యత్తు**

ఈ విషాదంలో అందరినీ ఊపిరి సలపనివ్వకుండా చేస్తున్న అంశం.. వారిద్దరి కుమారులు. అమ్మ పిలిస్తే పలికేది లేదు, నాన్న అక్కున చేర్చుకునే స్థితిలో లేడు. ఒకరి తర్వాత ఒకరుగా తల్లిదండ్రులను కోల్పోయిన ఆ చిన్నారులు ఇప్పుడు అనాథలయ్యారు. అమ్మానాన్నల మధ్య ఏం జరిగిందో కూడా తెలియని వయసులో, వారు అనుభవిస్తున్న ఈ శూన్యం ఎవరూ పూడ్చలేనిది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
22.03.2026 ఆదివారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ 'ముద్ర' వేయండి
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# యుద్ధం తెచ్చిన 'గ్యాస్ ట్రబుల్'




పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం మన దేశానికి ప్రత్యక్ష సంబంధం లేకపోయినా దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచంలో ఎక్కడైనా సంక్షోభం తలెత్తితే దాని ప్రభావం ఇతర దేశాలపై పడటం సహజం. ప్రస్తుతం అమెరికాఇజ్రాయిల్ ఒకవైపు, ఇరాన్ మరోవైపు పోరాటం కొనసాగుతోంది. అమెరికా స్థావరాలు ఉన్న గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు పెంచింది. ఖతార్, సౌదీ అరేబియా, కువైట్, యూఏఈ వంటి దేశాల్లో చమురు, గ్యాస్ నిల్వలు లక్ష్యంగా మారాయి. హర్మోజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధం చేయడంతో చమురు, గ్యాస్ రవాణా తీవ్రంగా దెబ్బతింది. కొన్ని నౌకలను స్వాధీనం చేసుకోవడం, ధ్వంసం చేయడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. భారత్‌కు తాత్కాలిక మినహాయింపులు ఇచ్చినప్పటికీ భవిష్యత్తు అనిశ్చితంగా ఉంది. చమురు కొరత ఇప్పుడే కనిపించకపోయినా గ్యాస్ సంక్షోభం ప్రారంభమైంది.

**గ్యాస్ కొరత ప్రభావం**

భారత్‌కు అవసరమైన గ్యాస్‌లో సుమారు 40% ఖతార్ నుంచే వస్తుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ నుంచి కూడా దిగుమతులు ఉన్నాయి. ఈ దేశాలపై దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో సరఫరా అంతరాయం కలగొచ్చు. ఇతర దేశాల నుంచి దిగుమతులు ఉన్నా అవి తక్కువ. గ్యాస్ కొరత ప్రభావం ఇప్పటికే కనిపిస్తోంది. ప్రధాన నగరాల్లో అనేక హోటళ్లు మూతపడ్డాయి. కొన్నిచోట్ల కట్టెల పొయ్యిలకు మళ్లారు. బ్లాక్ మార్కెట్‌లో సిలిండర్ల ధరలు పెరిగాయి. ఆహార ధరలు కూడా పెరుగుతున్నాయి. ఫుడ్ డెలివరీ, క్యాటరింగ్ రంగాలు దెబ్బతిన్నాయి. దేవాలయాల్లో ప్రసాదాల పంపిణీ కూడా ఆగిన ఉదాహరణలు ఉన్నాయి.

**అవసరాలు – అందుబాటు**

దేశంలో 40 కోట్ల వంట గ్యాస్ కనెక్షన్లు, దాదాపు అంతే వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. కానీ దేశీయ ఉత్పత్తి కేవలం 30% మాత్రమే. మిగతా అవసరాలు దిగుమతులపై ఆధారపడుతున్నాయి. సీఎన్జీ వినియోగం పెరగడంతో డిమాండ్ మరింత పెరిగింది. యుద్ధం కొనసాగుతున్న పరిస్థితిలో దిగుమతులు ప్రమాదంలో పడితే పరిస్థితి తీవ్రమవుతుంది. ప్రభుత్వం కొరత లేదని చెబుతున్నా, నేలమీద పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

**బ్లాక్ మార్కెట్ బెడద**

గ్యాస్ కొరతను ఆసరాగా చేసుకుని బ్లాక్ మార్కెట్ దందా పెరిగింది. సిలిండర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బుకింగ్ చేసిన వినియోగదారులకు సరఫరా ఆలస్యం అవుతోంది. ఉజ్వల, దీపం వంటి పథకాల అమలు కూడా దెబ్బతినే అవకాశం ఉంది.

**ముగింపు**

ప్రపంచీకరణలో ఏ దేశం ఒంటరిగా ఉండదు. యుద్ధ ప్రభావం మనపై పడటం తప్పదు. యుద్ధం ముగిసి పరిస్థితులు సాధారణం అయ్యే వరకు గ్యాస్ సమస్య కొనసాగొచ్చు. ఈ నేపథ్యంలో బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయడం ప్రభుత్వాల బాధ్యత. పౌర సమాజం కూడా సహకరించాలి.

**కొసమెరుపు:**

నగరాల్లో గ్యాస్ లేకపోతే ప్రత్యామ్నాయం లేక ఇబ్బందులు పెరుగుతున్నాయి. అందుకే ఎలక్ట్రిక్ స్టవ్‌లు, ఇండక్షన్ కుక్కర్లకు డిమాండ్ పెరుగుతోంది. "గ్యాస్ ట్రబుల్" ఎప్పుడు తగ్గుతుందో అన్న ఆందోళన ప్రజల్లో పెరుగుతోంది.



ప్రొఫెసర్ పీటా బాబీ వర్ధన్,
జర్నలిజం పూర్వపు విభాగాధిపతి, డీన్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం,
9393100500.

# సహకార సంఘాలకు ఎన్నికలను వెంటనే జరపాలి!



రైతులకు తక్కువ వడ్డీకీ రుణాలు ఇస్తూ, సకాలంలో విత్తనాలు-ఎరువులు సరఫరా చేస్తూ వ్యవసాయానికి చేదోడుగా నిలిచే వ్యవస్థ సహకార సంఘాలు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల స్వయం ప్రతిపత్తి సంస్థలు. రైతు ఆర్థిక స్వావలంబన, గ్రామీణ అభివృద్ధి, ఆహార భద్రతకు ఇవి మూలాధారం. ఇప్పటివరకు ఈ సంఘాలు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించి రైతులను ఆదుకుంటున్నాయి. ఇటీవల సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆన్‌లైన్ సేవలు ప్రారంభించాయి. టిస్కాబ్, నాబార్డ్ నుంచి రుణాలు సమీకరించి డిసిసిబిల ద్వారా తక్కువ వడ్డీతో పంట రుణాలు అందిస్తున్నాయి. రుణమాఫీ వంటి ప్రభుత్వ పథకాలను కూడా రైతులకు చేరవేస్తున్నాయి. పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్ల ద్వారా కూడా విస్తరిస్తున్నాయి. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

అయితే గడువు ముగిసిన పాలకవర్గాల స్థానంలో ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పదవులతో భర్తీ చేసే ఆలోచనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ద్వారానే రైతులకు నిజమైన భాగస్వామ్యం కలుగుతుందని రైతు సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.

**తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి**

గ్రామస్థాయిలో కీలకమైన సహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసి దాదాపు రెండేళ్లు కావస్తోంది. ప్రస్తుతం ఇవి ప్రభుత్వ నియంత్రణలో కొనసాగుతున్నాయి. గత డిసెంబర్ 19న ప్రభుత్వం పిఎసిఎస్, డిసిసిబి, టెస్కాబ్ పాలకవర్గాలను రద్దు చేసి ఇన్‌చార్జిలను నియమించింది.

రాష్ట్రంలో 9 సహకార కేంద్ర బ్యాంకులు, 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 13 మంది సభ్యులతో మొత్తం 9,797 మంది పాలక వర్గ సభ్యులు ఉన్నారు. 2020 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. వాటి పదవీకాలం ముగిసిన తర్వాత పొడిగింపులు ఇచ్చినా, చివరకు రద్దు చేయడం జరిగింది.

**కొత్త జిల్లాల ప్రాతిపదికన ఎన్నికలు**

ప్రస్తుతం 33 జిల్లాల నేపథ్యంలో సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణ అవసరం ఉంది. కొన్ని జిల్లాల్లో సంఘాల సంఖ్య ఎక్కువగా, మరికొన్నింటిలో తక్కువగా ఉంది. కొత్త జిల్లాల ప్రాతిపదికన ఎన్నికలు నిర్వహించడం సముచితం.

**కొత్త సంఘాల అవసరం**


రాష్ట్రంలో 908 సంఘాలు ఉన్నప్పటికీ, 81 మండలాల్లో సహకార సంఘాలు లేవు. కొన్ని సంఘాలు రెండు గ్రామాలకు, మరికొన్ని 30 గ్రామాలకు సేవలందిస్తున్నాయి. సభ్యత్వంలో కూడా అసమానతలు ఉన్నాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ ఏర్పాటుకు తర్వాత కొత్త సంఘాలు ఏర్పడలేదు. 2019లో నిర్ణయం తీసుకున్నా అమలు కాలేదు. 2022లో కేంద్రం ప్రతి గ్రామానికి ఒక సహకార సంఘం ఏర్పాటు చేయాలని సూచించింది.

ప్రస్తుతం 131 కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వాటికి మంత్రివర్గ ఆమోదం, సిబ్బంది, బడ్జెట్ అవసరం. కొత్త సంఘాలు ఏర్పాటు చేస్తూనే ఎన్నికలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.



ఉజ్జిని రత్నాకర్ రావు
-9490952646

# ఉరితాడే ఊయలగా...



ఆయన పేరు పలికితేనే రోమాలు నిక్కబొడుస్తాయి... ఆ త్యాగగాథ తలచుకుంటే రక్తం రగిలిపోతుంది. తెల్లదొరల పాలనను అంతం చేయడానికి అగ్నిజ్వాలలా మారిన వ్యక్తి అతడు. "స్వాతంత్ర్యం నా జన్మహక్కు" అని నినదించిన వ్యక్తి అతడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఎదిరించి నిలిచిన యోధుడు అతడు. భవిష్యత్‌కు బలమైన బీజం వేయాలని తపనతో పార్లమెంటుపై బాంబు విసిరిన విప్లవ వీరుడు అతడు. విప్లవం ద్వారానే విజయం సాధ్యమని నమ్మిన మహోన్నత ఘనుడు అతడు — ఆయనే భగత్ సింగ్. ఇది కేవలం ఓ వ్యక్తి కాదు; దేశ చైతన్యాన్ని మేల్కొలిపే మహత్తర శక్తి, శాశ్వత స్ఫూర్తి. "నన్ను చంపగలరు, నా ఆశయాలను కాదు" అన్న ఆయన ఉక్కు నినాదం, ఉరికొయ్యపై చిరునవ్వుతో నిలిచిన అతని అపార ధైర్యం — ఇవి చరిత్ర పుటల్లో నిలిచిన శాశ్వత జ్యోతులు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారు ఎల్లకాలం జీవిస్తారనే సత్యానికి భగత్ సింగ్ చిరస్మరణీయ నిదర్శనం. 1907 సెప్టెంబర్ 28న నేటి పాకిస్తాన్‌లోని లాయల్పూర్ జిల్లా బంగాలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు భగత్ సింగ్ జన్మించాడు. చిన్ననాటి నుంచే దేశభక్తి అతని నరనరాల్లో నింపుకుంది. 12 ఏళ్ల వయసులోనే జలియన్‌వాలాబాగ్ దారుణాలను చూసి రగిలిపోయాడు. 14 ఏళ్లకే స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టాడు. మహాత్మా గాంధీ పిలుపుతో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ, ఆ ఉద్యమాన్ని నిలిపివేయడాన్ని సమర్థించలేదు. స్వాతంత్ర్యం యాచిస్తే రాదని, పోరాడితేనే సాధ్యమని గ్రహించాడు. కుటుంబ సభ్యులు పెళ్లి చేసేందుకు ప్రయత్నించగా, "నా జీవితాన్ని మాతృదేశ విముక్తి అనే ఉన్నతాశయానికి అంకితం చేశాను. కుటుంబ సుఖాల పట్ల నాకు మోజు లేదు" అంటూ తండ్రికి ఉత్తరం రాసి ఇంటిని విడిచాడు. అనంతరం నవజవాన్ భారత్ సభలో చేరి యువతను చైతన్యపరిచాడు. తర్వాత హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో చేరి సుఖ్‌దేవ్, రాజ్‌గురులతో కలిసి విప్లవ కార్యకలాపాలను కొనసాగించాడు. 1927లో సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం సందర్భంగా లాలా లజపతిరాయ్‌పై జరిగిన లాఠీచార్జ్ ఆయన మరణానికి దారితీసింది. దీనికి ప్రతీకారంగా బ్రిటిష్ అధికారి సాండర్స్‌ను భగత్ సింగ్, రాజ్‌గురు హత్య చేశారు. 1929లో పార్లమెంట్ లో బట్టుకేశ్వర్ దత్‌తో కలిసి బాంబులు విసిరి "ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదాలతో దేశాన్ని కుదిపేశారు. "చెవిటివారికి వినిపించాలంటే శబ్దం బిగ్గరగా ఉండాలి" అన్న ఆయన మాటలు పోరాటానికి నూతన అర్థం ఇచ్చాయి. తప్పించుకునే అవకాశం ఉన్నా, ప్రజల్లో చైతన్యం కలిగించాలనే ఉద్దేశంతో పోలీసులకు లొంగిపోయాడు.

1931 మార్చి 23న లాహోర్ జైలులో భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులను బ్రిటిష్ పాలకులు ఉరిశిక్ష అమలు చేశారు. ఉరికంబం ముందున్నా వారు భయపడలేదు; చిరునవ్వుతోనే మృత్యువును కౌగిలించుకున్నారు. "దేవుడిని స్మరించు" అన్నప్పుడు, "ప్రజలకు కష్టాలు ఇస్తున్నందుకు దేవుడిని ఎన్నోసార్లు ప్రశ్నించాను" అన్న ఆయన సమాధానం అతని ఆలోచనా స్వేచ్ఛకు నిదర్శనం. అందుకే ఆయనను కేవలం విప్లవకారుడిగానే కాక, భావజాల యోధుడిగా కూడా గుర్తిస్తారు. మార్చి 23ను 'షహీద్ దివస్'గా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. భగత్ సింగ్ కలలుగన్నది కేవలం రాజకీయ స్వాతంత్ర్యం కాదు; లౌకికత, సమానత్వం, సోషలిజం ఆధారంగా సమసమాజ నిర్మాణం. సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థ, భూస్వామ్య కట్టుబాట్లు, కులమత వివక్షలపై ఆయన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకం. ఆయన పేరు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటాలకు ప్రేరణగా నిలుస్తోంది. నేటి పరిస్థితుల్లో సమాజం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. మతం, కులం పేరుతో విభజనలు పెరుగుతున్నాయి. మతోన్మాదాన్ని రెచ్చగొట్టే శక్తులు బలపడుతున్నాయి. విద్య, వైద్య రంగాలు పేదలకు అందని ద్రాక్షగా మారుతున్నాయి. నిరుద్యోగం పెరుగుతోంది. ప్రపంచ రాజకీయ పరిణామాలు, యుద్ధాలు సాధారణ ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి.

ఇక యువతలో వ్యసనాల పెరుగుదల ఆందోళనకరం. గంజాయి, డ్రగ్స్ వంటి దురలవాట్లకు బానిసలవుతున్న యువశక్తి భవిష్యత్తును కోల్పోతోంది. ఆన్లైన్ బెట్టింగ్ వంటి ప్రమాదకర ధోరణులు జీవితాలను నాశనం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యసనాలను అరికట్టడం, యువతను సరైన దిశలో నడిపించడం అత్యవసరం. భగత్ సింగ్ స్ఫూర్తితో యువత మేల్కొనాలి. మతోన్మాదానికి వ్యతిరేకంగా, కులమత అడ్డుగోడలను కూల్చేందుకు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ముందుకు రావాలి. ఉపాధి అవకాశాల కోసం, సమానత్వ సమాజ నిర్మాణం కోసం పోరాడాలి. ప్రజా సమస్యలపై చైతన్యంతో నిలబడి ఉద్యమాలను బలోపేతం చేయాలి. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ కలలు కన్న సమాజం కోసం పోరాడినప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినవారమవుతాం. వారి త్యాగం చరిత్రలో మాత్రమే కాకుండా, మన ఆచరణలోనూ ప్రతిఫలించాలి.

ఇంక్విలాబ్ జిందాబాద్!



గడగోజు రవీంద్రాచారి,
9848772232
(మార్చి 23: భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం)



# ఆద్యంతం ఆసక్తికరం.. వీక్షణం 163వ అంతర్జాల కవిసమ్మేళనం..

అంతర్జాలంలో శనివారం ఉదయం జరిగిన 163వ కాలిఫోర్నియా వీక్షణం గవాక్షం కవిసమ్మేళనం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. సమావేశాన్ని ప్రారంభిస్తూ వీక్షణం అధ్యక్షురాలు డాక్టర్ గీతా మాధవి, నిర్వాహకులు మధు ప్రఖ్యా, గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్‌లకు.. పాల్గొన్న కవులకు స్వాగతం పలికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. 163 నెలలుగా నిరాటంకంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం ద్వారా కవులను ప్రోత్సహిస్తున్న విషయాన్ని వివరించారు. ప్రముఖ, యువ కవులు కలిసి ఈ వేదికను విజయవంతం చేస్తున్నారని తెలిపారు. కవి మధుబాబు ప్రఖ్యా కవిత్వంపై తన అభిప్రాయాలు పంచుకోగా, రాజేంద్ర ప్రసాద్ నిర్వాహక బాధ్యతలను గౌరవంగా భావిస్తున్నానన్నారు. అధ్యక్షుడు మధు ప్రఖ్యా మాట్లాడుతూ "కవి ఒక ఋషి, కవిత్వం ఒక శక్తి" అని పేర్కొన్నారు. తదుపరి మధు ప్రఖ్యా, రాజేంద్ర ప్రసాద్ సంయుక్తంగా కవిసమ్మేళనం నిర్వహించారు. రామాయణం ప్రసాదరావు ('ప్రణాలతో రణం'), లింగుంట్ల వెంకటేశ్వర్లు ('చైతన్య గీతం'), నాళేశ్వరం శంకరం ('సాగు'), కందుకూరి శ్రీరాములు ('ఉగాది వృక్షం'), కొత్తూరు సత్యనారాయణ గుప్త ('వీక్షణం సాహితీ గవాక్షం') తదితరులు తమ కవితలను వినిపించారు. ఇతర కవుల్లో శారద ('అవధానం'), ప్రశాంతి రాం ('ఉగాది'), వంశీకృష్ణ ('సాగరమధనం'), ఆది మోపిదేవి ('నాలోని అమ్మ అత్త ఎప్పుడు అయ్యింది'), డా. గీతా మాధవి ('శాంతి విలువ'), తాటిపర్తి బాలకృష్ణా రెడ్డి ('అద్దమే నా నిజమైన శత్రువు'), మధు ప్రఖ్యా ('కట్టె'), ఘంటా మనోహర రెడ్డి ('అంతరంగ శుద్ధి'), మౌనశ్రీ మల్లిక్ ('అటువైపు కూడా చూడు') తమ ప్రతిభను చాటారు. అలాగే కోదాటి అరుణ, భవాని ముప్పాళ్ళ, వైరాగ్యం ప్రభాకర్, డా. దేవులపల్లి పద్మజ, డా. దీపక్ న్యాతి, భోగెల ఉమామహేశ్వరరావు, పరిమి వెంకట సత్యమూర్తి తదితరులు ఉగాది, జీవితం, సమాజం అంశాలపై కవితలను వినిపించారు. గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ 'ఉగాది వచ్చింది' కవితను లయబద్ధంగా చదివి అందరినీ ఆకట్టుకున్నారు. చివరగా డాక్టర్ గీతా మాధవి అధ్యక్షులు మధు ప్రఖ్యా, ఉపాధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ మరియు పాల్గొన్న కవులకు ధన్యవాదాలు తెలుపుతూ సభను ముగించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులను కవులు అభినందించారు.




గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
వీక్షణం భారతీయ ప్రతినిధి.

# యుద్ధం ఓ అనర్థం



అహంకారంతో ఇతర దేశాల
సార్వభౌమత్వంపై
పెత్తనం
లొంగని వారి శవంతో
పొందుతున్న పైశాచికత్వం
ప్రపంచ దేశాలలో పట్టు కొరకు
ఒకరు చేస్తున్న యుద్ధం
ప్రతీకారంతో మరొకరు చేస్తున్న
యుద్ధం
పసిపిల్లలతో పాటు ఎందరో
అమాయకుల ప్రాణాలను బలిగొట్టున్న
యుద్ధం
సామ్రాజ్యవాద సవాలుకు ప్రతి సవాల్
ఈ యుద్ధం
భవిష్యత్ ను అంధకారంలో
ముంచుతున్న యుద్ధం
రానున్న రోజుల్లో ఆర్థిక సంక్షోభానికి
దారితీస్తున్న యుద్ధం
ఈ యుద్ధం మూడో ప్రపంచ యుద్ధానికి
నాంది పలుకబోతున్న యుద్ధమెమో
యుద్ధం ఆపడానికి జరగాలి
చర్చ
దానికి స్పందించాలి మనమంతా
ఈ యుద్ధం ఓ అనర్థం
ఈ యుద్ధం ఓ అనర్థం



అక్షరజ్వాల
9010483021



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 22.03.2026
www.mudranews.in | @mudranews



## మద్యం ఖాళీ కడుపుతో తాగొద్దు

భోజనం తర్వాత లేదా తిన్నాక మాత్రమే తాగడం వల్ల శరీరంపై ప్రభావం కొంత తగ్గుతుంది.




## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:**
పట్టణంలోని నెల్లికొండ క్రాస్ రోడ్డులో గల వ్యవసాయ మార్కెట్ యార్డులో సింగిల్ విండో ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో పున్నమినరేష్ కుమార్ పర్సన్ ఇంచార్జ్ గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, వైస్ చైర్మన్ జంగయ్య, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, డైరెక్టర్లు, ఉజ్వల్ కుమార్ రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనకు తరలిరావాలి

**ముద్ర, తాండూరు:**



తాండూర్ పట్టణంలోని ఇందిరానగర్ లో పునర్నిర్మించిన శ్రీ రామ్ మందిర్ విగ్రహ ప్రతిష్టాపన వేడుకలకు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు, హిందూ సంఘాల నేతలు తెలిపారు. ఈనెల 23 నుండి ఐదు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి మొదటి రోజు ఉదయం 6 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు. ఉదయం 7 నుంచి శ్రీ భద్రప్ప స్వామి హనుమాన్ దేవాలయం నుంచి నూతన రామాల యం వరకు మూల విరాట్ల విగ్రహ శోభాయాత్ర, మార్చి 24న ఆలయంలో శాస్త్రోక్తంగా శ్రీ గణపతి హోమాలు, పూజా కార్యక్రమాలు, మార్చి 25న విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజారోహ ణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనతో పాటు సీతారామచంద్ర, వీరాంజనేయ స్వామి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతాయ ని తెఇపారు. 26న ఎదుర్కోళ్లు, 27న కళ్యాణోత్సవంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం



**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:**
జిల్లా కేంద్రంలోని 16వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు ఇల్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మునిసిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్ సింధు పాల్గొన్నారు.

## సెట్‌లో అర్హత

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) ఫలితాల్లో ప్రభుత్వ ఆర్ట్స్ మరియు కామర్స్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న మల్లేష్ అర్హత సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. గీతాంజలి అభినందిస్తూ, విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# భక్తి, శ్రద్ధలతో ఇదుల్‌ఫితర్

**రంజాన్ పండుగను ముస్లింలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలతో వేలాది మంది ముస్లింలు చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా కొత్త బట్టలు ధరించి, భక్తిభావంతో ప్రార్థనలు చేశారు.మత గురువులు, మత పెద్దలు, ముత్తువలిలు రంజాన్ విశిష్టతపై ప్రసంగించారు.**

### అలంపల్లిలో శాసనసభ స్పీకర్

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని అలంపల్లి దర్గాలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర శాశనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. గంగారం పట్టణంలోని ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలకు వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య, కౌన్సిలర్లు లక్ష్మి కాంత్ రెడ్డి, నాయకులు కిషన్ నాయక్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### వేడుకల్లో పాల్గొన్న చీఫ్ విప్, ఎమ్మెల్యేలు

**ముద్ర, తాండూర్:**
తాండూర్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఉన్న ఈద్గా, చన్ గెస్ పూర్ రోడ్డు మార్గంలో ఉన్న పెద్ద దర్గా వద్ద తాండూర్ పట్టణ ముస్లింలతో పాటు సామూహిక ప్రార్థనలో ప్రభుత్వ చీఫ్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను అలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### మహబూబ్ నగర్‌లో ప్రభుత్వ విప్

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**
మహబూబ్ నగర్ ఈద్గా ప్రాంగణంలో ఖౌమి ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు అనంతరం వారిని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్



మారేపల్లి సురేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్.పీ. వెంకటేష్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ గోనెల శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, మున్సిపల్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

**ముద్ర, గద్వాల:**
గద్వాల పట్టణంలోని ఈద్గా మైదానంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రార్థన చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థనలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మీ నర్సింహులు, వైస్ చైర్మన్ శంకర్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నియో జకవర్గ ఇన్‌చార్జ్ బాసు హన్మంతునాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు గాజులపాడు రాఘవేంద్ర రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈద్గా వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

### నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే కూచుకుళ్ల

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**
నాగర్‌కర్నూల్ లో ముస్లింలు స్థానిక ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కార్యక్రమానికి హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ చైర్మన్ రమణరావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

### కాప్రా లో ఉప్పల్ ఎమ్మెల్యే

**ముద్ర, కాప్రా:**
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కాప్రా మసీదు లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు.డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్ మైనార్టీ నాయకులు బద్రుద్దీన్, బీఆర్ఎస్ నా యకులు మహేష్ ,శివ కుమార్ రహీం ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## ప్రార్థనలకు భారీ బందోబస్తు




ముద్ర కూకట్‌పల్లి: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి పరిధిలోని మసీదుల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల భద్రత, ప్రార్థనల ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. కూకట్‌పల్లి వ్యాప్తంగా 12 మసీదుల వద్ద పోలీసు బలగాలను భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా లా అండ్ ఆర్డర్ విభాగంతో పాటు ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేశారు. ప్రార్థనల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మసీదుల పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ, పాదచారులకు ఆటంకం కలగకుండా సిబ్బందిని కేటాయించారు. ముందస్తు జాగ్రత్త చర్యగా బాంబు డిస్పోజల్ బృందాలు సున్నిత ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాయి. బందోబస్తు ఏర్పాట్లను సీనియర్ పోలీసు అధికారులు స్వయంగా పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూశారు. పండగను ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన మసీదు నిర్వాహకులకు, స్థానిక ప్రజలకు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రంజాన్ ప్రార్థనలు దిగ్విజయంగా ముగిశాయని వారు పేర్కొన్నారు.










## శనేశ్వర స్వామికి తిలతైలాభిషేకం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**
పరాభవ నామ సంవత్సరం చైత్ర శుక్ల తదియ శనివారం బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహ దోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేకాలు చేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు జన్మరీత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలం నాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజ లు, అర్చనలు, దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచే నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీరశేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ ఆర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా శానిటేషన్ పనులు

**ముద్ర, కాప్రా:**
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 శానిటేషన్ కార్యక్రమాలు వేగవంతంగా చేపడుతున్నట్లు అడిషనల్ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. కాప్రా సర్కిల్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పరిశుభ్రత ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేకంగా మసీదులు, దర్గాల పరిసరాల్లో సానిటేషన్ పరిస్థితులను సమీక్షించిన ఆయన, గ్రీన్ వేస్ట్ నిర్వహణలో ఉన్న సమస్యలను గుర్తించారు. రామ్కీ ట్రాన్స్ఫర్ స్టేషన్ వద్ద స్వచ్ఛ ఆటోలు ఇంటింటి నుండి సేకరించే చెత్తను ఇబ్బందులు లేకుండా తరలించేందుకు అవసరమైన కంటైనర్ల సంఖ్యను పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కుషాయిగూడ వాసవి శివ నగర్ ప్రాంతంలో ప్రైవేట్ స్థలంలో డంప్ చేసిన గ్రీన్ వేస్ట్‌ను తక్షణమే



తొలగించాల్సిందిగా రామ్‌కీ సంస్థ అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, శానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్లు రామకృష్ణ, శ్రీనివాస్, ఎస్ సుజాత, వసంత, రామ్‌కీ ఉప్పల్ జోనల్ ఇంచార్జ్ కృష్ణ, కాప్రా సర్కిల్ ఇంచార్జ్ నవీన్ కుమార్ రెడ్డి, సూపర్వైజర్ శృతి పాల్గొన్నారు. తమున్సిపల్ అధికారులు చేపడుతున్న ఈ చర్యలతో ప్రాంతాల్లో పరిశుభ్రత మరింత మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## సన్మానం



**ముద్ర, తాండూర్:**
తాండూర్ పట్టణంలో నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కోట మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీ కోట్రీక కిరణ్ కుమార్, అలాగే 24 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్గా గెలుపొం దిన బాలకృష్ణారెడ్డిని ద్వారకానగర్ కాలనీవాసులు శ్రీశ్రీశ్రీ పరమాత్మ నందా స్వామివారి ఆధ్వర్యంలో సన్మా నించా రు. గీత సత్సంగ్ సమితి ప్రధాన కార్య దర్శి దేవగారి రమేష్ కుమార్, ఉపా ధ్యక్షులు వాసు, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, సోమనాథ్ పాల్గొన్నారు.

## కలెక్టర్ కు శుభాకాంక్షలు

**ముద్ర, గద్వాల:**
జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కు తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కరుణా కర్, జనరల్ సెక్రటరీ అజిత్ కుమార్, యూనియన్ నాయకులు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం శుభాకాంక్షలు తెలిపారు.

### మూసాపేటలో రంజాన్ వేడుకలు

**ముద్ర, కూకట్‌పల్లి:**
మూసాపేటలో ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు చున్ను పాషా ఆధ్వర్యంలో జరిగాయి. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించా రు. నాయకులు మోసిన్, జాకీర్, వేణు, సంతోష్, వెంకటేశ్వర రావు, భాస్కర్, పెంటయ్య,వినయ్, కర్రెమ్మ, నారా యణ, సచిన్ పాల్గొన్నారు.

### ఆల్విన్ కాలనీలో..

**ముద్ర, కూకట్‌పల్లి :**
ఆల్విన్ కాలనీ 124 డివిజన్ పరిధిలోని ముస్లింలు ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ పాల్గొన్నారు. డివిజన్ లేబర్ సెల్ ప్రెసిడెంట్ జి. రవి, నాయకులు నాగయ్య, నాగరాజు, కేబుల్ సాయి, బాబ్జి, శివ, మోహన్ పాల్గొన్నారు.

## బడ్జెట్ అంతా అంకెలగారడి

**-మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**
కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలగారడీగా ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. శనివారం పాలమూరులో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నీ వర్గాలను నిరాశపరిచిందన్నారు. మూడవ బడ్జెట్లో కూడా ప్రభుత్వం సంక్షేమం పథకాలపై ఎక్కువ దృష్టి పెడుతుందని ఆశించిన వారికి నిరాశ మిగిల్చిందన్నారు. బడ్జెట్ లో ఏ ఒక్క వర్గానికి న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు,11 డిక్లరేషన్లకు అనుగుణంగా బడ్జెట్ రూపొకల్పన లేదన్నారు. బీసీలకు ఏడాదికి రూ.20 వేల కోట్లు, ఐదేండ్లకు లక్ష కోట్లు ఇస్తామని ప్రకటించి ఇప్పుడు కేవలం 3.85 శాతం మాత్రమే కేటాయించారని అన్నారు. బీసీ గురుకులాల్లో అన్నం సరిగ్గా లేక విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని, మైనారిటీ గురుకులాల్లో వసతులు లేక ఖాళీ అవుతున్నాయన్నారు. సీపీఎస్ రద్దు చేస్తామని ప్రభుత్వం మాట తప్పిందని, పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు సరిగ్గా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదన్నారు. అన్నం పెట్టే రైతు ఇబ్బందుల్లో ఉన్నాడని, రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. కరెంటు సరిగ్గా లేదని, సకాలంలో యూరియా అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పండించిన తరువాత కనీసం గిట్టుబాటు ధర ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు, గురుకులాలు, మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ అస్పత్రులు పెద్ద మొత్తంలో అభివృద్ధి చేసి రాష్ట్ర సంపదను పెంచామని, ప్రజల ఆస్తుల విలువ కూడా పెంచామన్నారు. బీసీ లకు రూ.50 వేల కోట్లు ఇవ్వాల్సిందేని, దళితుల అభివృద్ధి కోసం రూ.10 లక్షలు బడ్జెట్ లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని తిరోగమనంలోకి నెట్టేదని, అంకెల గారడీ తప్ప సంక్షేమ బడ్జెట్ కాదన్నారు. అన్నీ పార్టీలు రాజకీయాలకు అతీతంగా అన్నీ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందె బడ్జెట్ రూపొకల్పన చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెహమాన్ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్స్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూకు బడ్జెట్‌లో మొండిచేయి

**స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆగ్రహం**

**ముద్ర కూకట్‌పల్లి:**




రాష్ట్ర బడ్జెట్‌లో జేఎన్‌టీయూ సాంకేతిక విశ్వవిద్యాలయానికి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశం అనంతరం ఫోరం నాయకులు జవాజీ దిలీప్, రాహుల్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వేలాది మంది ఇంజనీర్లను తీర్చిదిద్దుతున్న జేఎన్‌టీయూకు ఈ బడ్జెట్‌లో కనీస ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం అత్యంత విచారకరమని వారు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని 8 అనుబంధ కళాశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, పరిశోధన సౌకర్యాల కోసం నిధులు లేకపోవడం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేయడమేనని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి జేఎన్‌టీయూ అభివృద్ధి కోసం రూ. 500 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఈ విషయమై త్వరలోనే ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో, జేఎన్‌టీయూలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరాహార దీక్ష చేపడతామని వారు హెచ్చరించారు.

### మద్యం: నీరు ఎక్కువగా తాగండి

మద్యం తీసుకునే సమయంలో నీటిని కూడా తీసు కుంటే డీహైడ్రేషన్ తగ్గుతుంది.



# కరీంనగర్ పాలిటిక్స్‌లో హీట్

**- హుజూరాబాద్‌లో కౌశిక్‌పై తిరుగుబాటు..**
**- జగిత్యాలలో జీవన్ రెడ్డి గుడ్ బై?**
**- అంతర్గత పోరు.. పార్టీ మార్పుల సంకేతాలు**
**- ఉమ్మడి జిల్లాల్లో రాజకీయ కలకలం**





**ముద్ర, కరీంనగర్:**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా ఉత్కంఠభరితంగా మారాయి. ముఖ్యంగా హుజూరాబాద్, జగిత్యాల ప్రాంతాల్లో పార్టీ అంతర్గత విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకుని, భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఈ పరిణామాలు కేవలం మాటల యుద్ధంగా కాకుండా, పార్టీ మార్పుల దిశగా మలుపు తిరుగుతున్నట్లు కనిపిస్తోంది.

హుజూరాబాద్ నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితిలో అంతర్గత అసంతృప్తి బహిర్గతమైంది. స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారశైలిపై పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల జమ్మికుంట ప్రాంతంలో జరిగిన రహస్య సమావేశం ఈ విభేదాలను మరింత బహిర్గతం చేసింది. ఈ సమావేశానికి వందకు పైగా కీలక నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరైనట్లు తెలిసింది. ఈ సమావేశంలో పలువురు నాయకులు ఎమ్మెల్యేపై నేరుగా విమర్శలు గుప్పించారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా కష్టపడ్డ సీనియర్ నేతలను పక్కనబెట్టి, వ్యక్తిగత అజెండాను ముందుకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. కొన్ని స్థానిక వివాదాలను పార్టీపైకి మోపడం వల్ల కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కూడా పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి కూడా ఎమ్మెల్యే నిర్ణయాలే కారణమని కొందరు కౌన్సిలర్లు వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**ఫిరాయింపులకు కారణమా..?**

ఈ అసంతృప్తి క్రమంగా పార్టీ ఫిరాయింపులకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొందరు అసంతృప్తి నేతలు ఇప్పటికే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. త్వరలోనే పెద్ద ఎత్తున మార్పులు జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**రాజీనామా దిశగా జీవన్ రెడ్డి ?**

ఇదే సమయంలో జగిత్యాల రాజకీయాల్లో కూడా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. జగిత్యాల జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేయనున్నారనే వార్తలు చర్చనీయాంశమయ్యాయి. ఈ నెల 25న తన అనుచరులతో కలిసి రాజీనామా చేయాలని భావిస్తున్నట్లు సమా చారం. ఈ నేపథ్యంలో ఆయన జిల్లా కేంద్రంలో కీలక సమావేశం నిర్వహించి, నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ పరిణామాల మధ్య ఐటీ, శాసన సభ వ్యవ హారాల మంత్రి శ్రీధర్ బాబు జీవన్ రెడ్డితో భేటీ కావడం పరిస్థితిని కొంత మేర మార్చి నట్లు కనిపిస్తోంది. ఆ చర్చల తర్వాత జీవన్ రెడ్డి వైఖరిలో స్వల్ప మార్పు కనిపించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తుది నిర్ణయం ఇంకా ప్రకటించకపోయినా, ఆయన తదుపరి అడుగులపై ఉత్కంఠ కొన సాగుతోంది. కరీంనగర్ జిల్లాలో రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఒక వైపు బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు, మరోవైపు కాంగ్రెస్ నాయకుల్లో మార్పులు. మరి, రాబోయే రోజుల్లో ఈ పరిణామాలు ఎలా మలుపు తిరుగుతాయో ఆసక్తిగా మారింది.

## కొండగట్టు అంజన్న సేవలో కేంద్ర మంత్రి



**ముద్ర, జగిత్యాల:** జగిత్యాల జిల్లాలోని మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామివారిని శనివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కాంగ్రెస్ పార్టీ నేతలను పరామర్శించిన మంత్రి లక్ష్మణ్ కుమార్

**ముద్ర, గొల్లపల్లి:** గొల్లపల్లి మండలం ఎనుగుమట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. సురిగినేని రాజేశ్వరరావు చిన్నమ్మ ఇటీవల మరణించగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి ఆకాంక్షించారు. ఎనుగుమట్ల మండల గ్రామానికి చెందిన ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి ఇటీవల మరణించగా మంత్రి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. మంత్రి వెంట పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## హోటళ్లలో గృహావసర సిలిండర్లు వాడొద్దు



**ముద్ర, ఆదిలాబాద్:**
హోటళ్లు, రెస్టరెంట్లు, టిఫిన్ సెంటర్లలో గృహావసర సిలిండర్లను వినియోగించొద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మహేష్ తెలిపారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న గృహ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. కొందరు వ్యాపారులు వాణిజ్య అవసరాలకు గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తూ కృత్రిమ కొరతకు కారణమవుతున్నారని కలెక్టర్ రాజర్షి షా తనిఖీలు చేపట్టాలనే ఆదేశం మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హోటళ్లు, రెస్టరంట్లు, టిఫిన్ సెంటర్లలో గృహావసర సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రాహుల్ ను ప్రధాని చేయడమే లక్ష్యం

**- పేద మైనార్టీలకు అండగా ప్రజా ప్రభుత్వం**
**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**- రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన మంత్రి**



**ముద్ర, ధర్మపురి:**
రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేయడానికి సెక్యులర్ పార్టీ ఆయన కాంగ్రెస్ పార్టీకి మైనార్టీలంతా అండగా నిలవాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. రంజాన్ సందర్భంగా శనివారం జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మసీదులు, ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ముస్లిం లకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పేద మైనార్టీలకు ప్రభుత్వం ద్వారా అందించే రుణాలు ఇప్పించడానికి తనవంతుగా సహకరిస్తానని మంత్రి తెలిపారు. ముస్లిం యువతకు ఉపాధి కల్పించడానికి తాను ప్రత్యేక చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

పేద ముస్లింలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు అర్హులకు రేషన్ కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. మసీదులు, ఈద్గాల వద్ద మౌలిక వసతుల కల్పనకు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. నిరుపేదల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న తో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు నాయకులు ఉన్నారు.

## ఈద్గా నిర్మాణానికి స్థల పరిశీలన



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ పట్టణంలో నూతనంగా నిర్మించబోయే ఈద్గా స్థలాన్ని శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పరిశీలించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈద్గా కోసం వక్ఫ్ బోర్డు 5.01 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ సందర్భంగా అక్కడ చేపట్టబోయే పనులను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఆయన వెంట అర్జుమంద్ అలీ, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

## బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గా సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును ఎస్పీ జానకి షర్మిళ పర్యవేక్షించారు. ఈద్గా వద్దకు వచ్చిన చిన్నారులకు చాక్లెట్లు అందజేశారు. ఆమె వెంట ఇన్ స్పెక్టర్లు కృష్ణ, గోవర్ధన్ రెడ్డి, సమ్మయ్య, ఆర్ఎస్ఐ లు రాజ శేఖర్, సాయి కృష్ణ ఉన్నారు.

## యువతకు అన్యాయం చేయొద్దు



**ముద్ర, జగిత్యాల:**
కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేఖరుల సమావేశంలో మట్లాడారు. కొత్త ఉద్యోగాలు రాక, ఐటీ ఉద్యోగాలు కూడా గణనీయంగా తగ్గడంతో యువత ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలను వంచించేలా ఉందని ఆరోపించారు. బడ్జెట్ కేవలం అంకెల గారడీ మాత్రమేనన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాలుగు లక్షల ఇళ్లకు గాను రూ. 20వేల కోట్లు అవసరం ఉంటుందన్నారు. కానీ గత బడ్జెట్ సమావేశంలో రూ. 5వేల కోట్లు, ఈ బడ్జెట్ సమావేశంలో రూ. 5వేల కోట్లు కేటా యించారని చెప్పారు. ఈ నిధులు ఇందిరమ్మ లబ్ధిదారులకు పూర్తి సరిపోవన్నారు. మిగిలిన లబ్ధిదారులకు మొండి చేయి చూపారన్నారు.

# పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలి

**- ఎస్పీ అఖిల్ మహాజన్**




**బోథ్, ముద్ర:**
గ్రామల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన బోథ్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ముందుగా మహిళా పోలీసు సిబ్బంది నిత్యావసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళల భద్రత, రక్షణ చర్యలు పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని సూచించారు. మహిళల రక్షణ కోసం షీ టీం 24 గంటలు అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలను చేపడుతున్నట్టు పేర్కొన్నారు. వీపీఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామ స్థాయిలో జరిగే ప్రతి అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు దిశగా కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మండల పరిధిలో గంజాయి లేకుండా, గంజాయి రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా గుడుంబా లేకుండా చూడాలన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలకుండా, పశువుల రవాణా జరగ కుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు.

రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. మండలంలో ఓపెన్ డ్రిం కింగ్ జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. పెండింగ్ కేసులు పూర్తి చేసి చార్జిషీట్‌లు దాఖలు చేయాలని చెప్పారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు. వారి సమస్యలను పరిష్కరించి పోలీసుల పట్ల నమ్మకం పెంపొందించే విధంగా విధులు నిర్వహించాలన్నారు. విధుల్లో నిజాయితీ కనబరచాలన్నారు. అవినీతి చేసిన వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, బోథ్ సీఐ డి. గురుస్వామి, బోథ్, బజార్హత్నూర్ ఎస్సైలు వి. పురుషోత్తం, సంజయ్ పాల్గొన్నారు.

## వీధులను పరిశీలించిన డీఆర్ డీవో




**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ లో డీఆర్ డీవో శ్రీధర్ పలు వీధులను పరిశీలించి రోడ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. సీసీ రోడ్లు, పంచాయతీ భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో డీఆర్డీవో శ్రీధర్ పలు వీధులను పరిశీలించారు. దీనికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు డీఆర్డీవో పేర్కొన్నారు. ఆయన వెంట డీఈ రవిప్రసాద్, ఏఈ మల్లేశం, సర్పంచ్ వెంకటేశ్, ఉప సర్పంచ్ మహేష్ తదితరులు ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 22-03-2026
www.mudranews.in | @mudranews



**మద్యం : నిద్రను నిర్లక్ష్యం చేయొద్దు**

మద్యం నిద్ర నాణ్యతను దెబ్బతీస్తుంది. సరైన నిద్ర తీసుకోవడం ఆరోగ్యానికి అవసరం.



## చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీరాముడు



ముద్ర ప్రతినిధి, భువనగిరి :

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వసంత నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ రామాయణ పారాయణ క్రతు మహాయజ్ఞం రెండో రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్ర వేళలో స్వామివారిని అద్భుతంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంపై ఆలయ ప్రాంగణంలో భక్త జనుల హర్షధ్వానాల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ దివ్య వాహన సేవను దర్శించేందుకు అనేక మంది భక్తులు తరలి వచ్చారు. ఈ మహోత్సవాలలో భక్తులు విశేషంగా పాల్గొని తమ భక్తిని చాటుకుంటూ, ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళ హారతులు సమర్పించారు.



## నూతన ఈద్ గాపై స్టే ఆర్డర్

**- నమాజ్ చదువకుండా వెనుదిరిగిన మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ మసి ఉల్లాహ్ ఖాన్, ముస్లింలు**

ముద్ర ప్రతినిధి, భువనగిరి :

భువనగిరి పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఉన్న నూతన ఈద్ గాపై స్టే ఆర్డర్ ఉండడంతో నమాజ్ చదువకుండా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ మసి ఉల్లాహ్ ఖాన్, భువనగిరి పట్టణ ముస్లింలు వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఈద్గాలో లాండ్ గ్రాబర్స్ అనధికారికంగా కబ్జా చేసి హైకోర్టును తప్పు దోవ పట్టించి, అక్రమంగా స్టే ఆర్డర్ తీసుకొచ్చారని ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి భువనగిరి పట్టణ మైనారిటీ నాయకులతో వక్ఫ్ బోర్డుకు చెందిన సర్వే నెం. 902లో 3 ఎకరాలు 23 గుంటల భూమిని కబ్జాదారుల చెర నుండి విడిపించి ఈద్ గా కోసం అధికారికంగా కేటాయించడం జరిగిందన్నారు. నాటి నుండి నేటి వరకు జరుగుతున్న నమాజ్ ను చదవకుండ హైకోర్టును తప్పు దోవ పట్టించి స్టే ఆర్డర్ ను తీసుకొని నమాజ్ చదవకుండా నిలిపి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఖాజా అజీమోద్దీన్, ఎండీ ముజీబ్ ఇక్బాల్ చౌదరీ, నయీమ్, కాజమ్, ఇస్మాయిల్, ఆమెర్, ఖాజా ఖుతుబొద్దీన్, రహీం అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

**పేదలను, వ్యవసాయ కూలీలను**

## మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

పేదలపైన, వ్యవసాయ కూలీల పైన అనేక భారాలను మోపుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, బడ్జెట్లలో తగిన నిధులు కేటాయించకుండా కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ విమర్శించారు. శనివారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ దేశంలోని గ్రామీణ ప్రాంత పేదలకు, వ్యవసాయ కూలీలకు కీలకంగా ఉపయోగపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసి పేరు మార్చి, బడ్జెట్లో నిధులు కోత విధించిందనిని విమర్శించారు. అదే బాటలో రాష్ట్ర ప్రభుత్వం కూడా నిన్న ప్రవేశపెట్టిన బడ్జెట్లో పేదలను, కూలీలను విస్మరించిందని తెలిపారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే పరిపాలన లక్ష్యం అనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కొటేషన్ చెప్పి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి అందుకు భిన్నంగా బడ్జెట్ ను ప్రతిపాదించారని విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలుకు ఎలాంటి నిర్దిష్టమైన ప్రతిపాదనలు లేవని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వ్యవసాయ కూలీలు, పేదలు సంఘటితంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జెల్లెల పెంటయ్య, గంగాదేవి సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు సిరిపంగి స్వామి, సల్లూరి కుమార్, కూకుట్ల చొక్కా కుమారి, కమిటి సభ్యులు అందెల జ్యోతి, దొడ్డి బిక్షపతి, కొండపురం యాదగిరి, మెతుకు అంజయ్య, బొల్లెపల్లి కిషన్, కొమ్ము అంజయ్య పాల్గొన్నారు.




## భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగ

**- జిల్లా వ్యాప్తగా ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు..**

**- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, నాయకులు**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం ఈద్గాల వద్దకు అధిక సంఖ్యలో ముస్లింలు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు. ప్రతి ఏడాది హిందూ, ముస్లిం లు కలిసి ఇక్కడ రంజాన్ పర్వదినాన్ని జరుపుకొని మతసామరస్యాన్ని చాటుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు.

ఈ సందర్భంగా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

### ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

భువనగిరి ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి , ఆర్డీవో కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణిరవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, కమిషనర్ రామలింగం, పలువురు నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



### తుంగుర్తిలో..

ముద్ర, తుంగతుర్తి:

మండల వ్యాప్తంగా ముస్లింలు ఈద్ – ఉల్–ఫితర్ (రంజాన్) పర్వదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మత గురువు మౌలానా అబ్దుల్ ఆహాద్ మాట్లాడుతూ క్రమశిక్షణ, దైవచింతన, దానగుణంతోపాటు ఇతరుల పట్ల ప్రేమ దయ జాలి చూపించే దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. కులమత బేధాలు లేకుండా ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఖురాన్ పఠనం గావించి నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు,

ఈ కార్యక్రమంలో మజీద్ నూర్ కమిటీ అధ్యక్షుడు ఎండి జాన్, ఉపాధ్య క్షుడు ఎస్కే లాల్, మైనారిటీ యూత్ కమి టీ అధ్యక్షుడు ఎస్కే నజీర్, ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్, కార్యదర్శి ఎస్కె కరీం, సభ్యులు నజీర్, శాలం, సిద్దిక్, సమీ ర్, మహబూబ్ అలీ, ఫజిలుద్దీన్, వహీద్, అఫ్జల్, ఎస్కే జానిమియా, అలీ సాబ్, ఉస్మాన్, అక్రమ్, షరీఫ్, హఫీజ్, అన్వర్, మీరా సాబ్ తదితరులు పాల్గొన్నారు.





**ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో**

## రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతుల దహనం

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

వికలాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంపై వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం వినాయక చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురూపంగా ప్రకాష్, వనం ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్లో వికలాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపులో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన 3,24,234 కోట్ల బడ్జెట్లో వికలాంగుల సంక్షేమ శాఖను పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2025–26 బడ్జెట్లో రూ.77 కోట్లు కేటాయించిన ప్రభుత్వం 2026–27 బడ్జెట్లో నిధుల కేటాయింపులో ఎలాంటి పురోగతి లేదని మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖకు రూ.3143 కోట్లు కేటాయించిందని, ఇందులో వికలాంగుల సంక్షేమానికి ఎంత కేటాయించారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ను సవరించి వికలాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపులు పెంచాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత, భువనగిరి మండల నాయకులు పాండాల శ్రీహరి, ఎండి సలాం, గోపి, దండ బోయిన గణేష్, రాసాల నవీన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.




### నేడు పీసీసీ అధ్యక్షుడి రాక

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

భువనగిరి పట్టణంలోని పాత వివేరా హోటల్ లో ఆదివారం డీసీసీ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా రానున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యుల నియామకం అయిన తర్వాత ప్రమాణ స్వీకార పదవి బాధ్యతల కార్యక్రమాన్ని పాత హోటల్ వివేరాలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## మాయమాటలతో ప్రజలను మోసం చేసిన సీఎం

**- బీఆర్ఎస్ నాయకులు**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

సీఎం రేవంత్ రెడ్డి మాయమాటలతో మరోసారి ప్రజలను మోసం చేశారని బడ్జెట్ లో బీసీ, ఎస్సీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ, ఎస్సీ, మైనార్టీ బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ పైన శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చారని, ఆరు గ్యారెంటీలకు కానీ బీసీ, ఎస్సీలకు కానీ ప్రత్యేక సబ్ ప్లాన్లు ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. కుల వృత్తులకు కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యేకంగా నిధులు కేటాయించారని అన్నారు. గొర్రెల పెంపకం దారులకు, చేపల పెంపకం దారులకు రూ.2 లక్షలు ఇస్తానని, దళితులకు 12 లక్షల రూపాయలు, బీసీ బంధు ప్రతి ఒక్కరికి ఇస్తానని, రైతుబంధు సంవత్సరానికి మూడు పంటలకు ఇస్తానని, పెన్షన్ 4000 ఇస్తానని, మహిళలకు రూ.2500, ప్రతి ఆడపిల్ల పెళ్ళికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి బడ్జెట్లో ఏ ఒక్క పథకానికి కూడా ప్రత్యేక నిధులు ఇవ్వలేదన్నారు. రానున్న రోజులలో ప్రజల కోసం టిఆర్ఎస్ పార్టీ తరపున అనేక పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ జెడ్పిటిసి సుబ్బురు బీరు మల్లయ్య, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవి కిరణ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు ఇట్టబోయిన గోపాల్, కౌన్సిలర్లు నాకోటి నగేష్, చీమల రాజు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నర్సింగరావు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు తాడూరి బిక్షపతి, ఇక్బాల్ చౌదరి, కాజం, అంజద్, సూరిపంగా సుభాష్, గుజ్జ పవన్, దొప్ప వెంకటేష్, బచ్చు వెంకటేష్, సైదులు, విక్రమ్ పాల్గొన్నారు.




## కాంగ్రెస్ హయాంలోనే పూర్తయిన జలయజ్ఞం కాలువలు

**- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

జలయజ్ఞంలో భాగంగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టిన కాలువలు మళ్ళీ కాంగ్రెస్ హయాంలోనే పూర్తయ్యాయని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భువనగిరి వద్ద వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి కింది నుంచి వెళ్లే బస్వాపురం ప్రాజెక్ట్ కాలువను ఆయన పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి మాత్రమే మన ప్రాంతానికి నీరు వస్తుందని, కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి కాదని స్పష్టం చేశారు. బస్వాపురం ప్రాజెక్టు నుంచి కాలువల నిర్మాణం ద్వారా వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే ప్రారంభమయ్యాయని, భువనగిరి వద్ద వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి కింద నుంచి వెళ్ళే ఈ కాల్వను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల చెరువులకు నీరు అందలేదని అన్నారు. ప్రస్తుతం ఈ కాలువ పూర్తి కావటంతో భువనగిరి, వలిగొండ మండలాలలో చెరువులు నింపి పంట పొలాలకు నీరు అందించే కార్యక్రమం మొదలైందని అన్నారు. ఏడున్నర కోట్ల ఖర్చుతో కల్వర్టు నిర్మాణం పూర్తిచేసి నీరు అందిస్తున్నట్టు తెలిపారు.

బస్వాపూర్ ప్రాజెక్టులో ఇంకా పూర్తి స్థాయిలో నీళ్లు నింపలేదని ముంపు గ్రామం బి ఎన్ తిమ్మాపురంలో ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇంకా కొంత మందికి పరిహారం అందలేదని, మరో రూ.50 కోట్లు నిధులు విడుదల చేస్తే బి ఎన్ తిమ్మాపూర్ గ్రామం ఖాళీ అయ్యి నీళ్లు నింపడానికి అనువుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం బస్వాపురం ప్రాజెక్టు 0.7 టీఎంసీల నీరు నిల్వ సామర్థ్యం ఉందన్నారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి వద్ద కూడా రోడ్డును కటింగ్ చేసి కాల్వ ద్వారా నీరు వెళ్లేలా చేసే కార్యక్రమం చేయబోతున్నట్లు తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
22.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మద్యం బదులు ఆరోగ్యకరమైన అలవాట్లు పెంచుకోండి**

వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటితో స్ట్రెస్ తగ్గించుకోవచ్చు.



# ఘనంగా రంజాన్ వేడుకలు



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనం గా జరిగాయి. జిల్లా కేంద్రం మెదక్ పట్టణం, నియోజకవర్గ కేంద్రం నర్సాపూర్, రామాయంపేటతో పాటు మండల కేంద్రాలు, ముస్లిం సోదరులు ఉన్న గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నెలవం క కనిపించడంతో శనివారం ఉదయం కొత్త బట్టలు ధరించి ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

### ఈద్గా వద్దకు ఎమ్మెల్యే రోహిత్

మెదక్ పట్టణంలోని నవాబుపేట ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో వేలాది మంది ముస్లిం సోదరులు పాల్గొన్నారు. సయ్యద్ ఖాజా మొయినుద్దీన్ అల్లా సందేశం వినిపించారు. ఎమ్మెల్యే రోహిత్ ముస్లిం సోదరులతో కలిసి ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను ముస్లిం సోదరులు నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టి జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఈద్గాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి వసతులు కల్పించామన్నారు.. మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ దొంతి లక్ష్మి ముత్యంగౌడ్, మాజీ చైర్మన్ చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్లు మన్సూర్, హరిత, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. నర్సాపూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మురళీధర్ యాదవ్ పాల్గొన్నారు.

### బందోబస్తు పరిశీలించిన ఎస్పీ

రంజాన్ పర్వదినం పురస్కరించుకుని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలోని నవాబుపేట ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన భద్రతా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టామన్నారు.. వెంట అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# ఉపాధి కూలీల బకాయి వేతనాలు చెల్లించాలి

- 24న కలెక్టరేట్ ముందు ధర్నా
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆడివయ్య




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

ఉపాధి కూలీల బకాయి వేతనాలు చెల్లించాలని, ఫోటో తీసే పద్ధతిలో మార్పు చేయాలని సి.పి.ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆడివయ్య డిమాండ్ చేశారు. భూ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్లు, మైనర్ ఇరిగేషన్ పనులకు నిధులు కేటాయించాలని, జిల్లాలో ప్రజాసమస్యలపై ఈనెల 24న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో జరిగిన సి.పి.ఎం మెదక్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆడివయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత 15 రోజులుగా సి.పి.ఎం కార్యకర్తలు ప్రజా సమస్యలపై సర్వే చేయగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని ఆడివయ్య పేర్కొన్నారు. జిల్లాలో అనేక గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. పని ప్రారంభించిన చోట చేసిన పనికి కూలీ డబ్బులు అందడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడం కోసం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతోందని దుయ్యబట్టారు. ఈ కుట్రలో భాగంగానే రోజుకు రెండు పూటల ఫోటోలు తీసే విధానం వల్ల సిగ్నల్ లేక చేసిన పనికి కూలీ రాకపోవడంతో కొందరు పనికి దూరమవుతున్నారని తెలిపారు. ఎండలు ముదిరిన నేపథ్యంలో పని ప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యం కల్పించడం లేదని తీవ్రంగా విమర్శించారు. ఉపాధి హామీ పనులపై పూర్తి అనుభవం ఉన్న క్షేత్ర సహాయకులు లేకపోవడం వల్ల పనుల నిర్వహణలో తీవ్ర అలసత్వం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో సి.పి.ఎం జిల్లా కార్యదర్శి కె. నరసమ్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, కే. మల్లేశం, బాలమణి, మహేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు నాగరాజు, సంతోష్, ప్రవీణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కూచాద్రి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి కూచాద్రి వేంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పూజారి గోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. అనంతరం రేణుకమాత దేవాలయంలో పూజలు నిర్వహించారు. వెంట యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరశురామ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, రాగి అశోక్, భూపతిరాజు తదితరులు ఉన్నారు.



# రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన రైతు ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా రైతులు ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఈ నెల 22న 2,650 మంది రైతులను 53 బస్సుల ద్వారా నర్మెట్ట గ్రామానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, ఆయిల్ ఫామ్ రిఫైనరీ శిలాఫలక ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ, అనుబంధ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలతో సాంకేతిక చర్చలు జరిపి ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పొందుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, ఉత్తమ రైతుల అనుభవాలను తెలుసుకొని తమ వ్యవసాయంలో అమలు చేయదగిన పద్ధతులను గ్రహిస్తున్నట్లు వివరించారు.

# డిజిటల్ చెల్లింపులతో రుణ వసూళ్ల వేగం..

- గ్రామైక్య సంఘాలకు ఈ-పోస్ సౌలభ్యం



**ముద్ర న్యూస్ :**

ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం గణనీయంగా పెరుగుతోంది. ప్రతి ఒక్కరి చేతిలో చరవాణి అందుబాటులో ఉండటంతో సేవలను సులభంగా పొందే అవకాశాలు విస్తరించాయి. ఈ నేపథ్యంలో 'స్త్రీనిధి' ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ డిజిటల్ విధానాలపై దృష్టి సారిస్తోంది. గ్రామైక్య సంఘాలకు ఈపోస్ యంత్రాలను అందిస్తూ డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తోంది. దీంతో ఆర్థిక లావాదేవీల్లో అక్రమాలకు చెక్ పడటంతో పాటు సకాలంలో నగదు జమయ్యే విధానం సుగమమైంది. సుమారు రూ.15 వేల విలువైన ఈపోస్ యంత్రాలను ఎస్‌బీఐ సహకారంతో స్త్రీనిధి ఉచితంగా అందిస్తోంది. గత ఏడాది నుంచి పంపిణీ ప్రారంభమై మొదటి దశలో 47, రెండో దశలో 103 యంత్రాలు అందించగా, మూడో దశలో 44 యంత్రాల పంపిణీకి సిద్ధమయ్యారు.

**-యాప్‌ల ద్వారా వాయిదా చెల్లింపులు**

202526 ఆర్థిక సంవత్సరానికి స్త్రీనిధి (సెర్ప్) రుణ లక్ష్యాన్ని రూ.42 కోట్లుగా నిర్ణయించారు. ఇప్పటి వరకు రూ.24.50 కోట్లు పంపిణీ చేయగా, సుమారు 56 శాతం మేర రికవరీ సాధించారు. మరోవైపు జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా రుణ వాయిదాలు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు 65 శాతం వరకు ఉండటం గమనార్హం. ఈపోస్ యంత్రాల ద్వారా ఎస్‌హెచ్‌జీ ఐడీ, సంఘం పేరు, సభ్యురాలి వివరాల ఆధారంగా నేరుగా చెల్లింపులు చేయవచ్చు. స్కాన్ విధానంతో సులభంగా లావాదేవీలు పూర్తిచేసే అవకాశం ఉంది. భవిష్యత్తులో మరిన్ని యంత్రాలు పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**రికవరీపై ప్రత్యేక దృష్టి**

స్త్రీనిధి రుణాల తిరిగి చెల్లింపులో జిల్లా వెనుకబడింది. వాయిదాపడ్డ బకాయిలు పురోగతికి అడ్డంకిగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మరో పది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న దృష్ట్యా ప్రతి గ్రామ సంఘం రోజుకు కనీసం రూ.20 వేల చెల్లింపులు చేసేలా ప్రోత్సహిస్తున్నారు. సంఘాలు చొరవ చూపితే జిల్లా పురోగతికి దోహదం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. డీఆర్డీవో జయదేవ్ ఆర్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. సీసీ, వీవోఏలకు నిత్యం మార్గదర్శకాలు అందిస్తున్నట్లు స్త్రీనిధి ప్రాంతీయ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు.

**సిద్దిపేట జిల్లాలో పరిస్థితి:**

స్వయం సహాయక సంఘాలు : 22,713
మొత్తం సభ్యులు : 2.39 లక్షలు.




# సంక్షేమ రంగాలకు నిధుల కోతపై నిరసన

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

రాష్ట్ర బడ్జెట్లో సంక్షేమ రంగాలకు నిధుల కోతకు నిరసనగా మెదక్ పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం 202627 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్లో వికలాంగుల సంక్షేమనికి నిధుల కేటాయింపులో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం 5 శాతం నిధులు కేటాయించాలన్నారు. కానీ బడ్జెట్ కేటాయింపుల్లో వికలాంగుల సంక్షేమ శాఖను పూర్తిగా విస్మరించారని తెలిపారు. ఈసారి బడ్జెట్లో నిధుల కేటాయింపులో ఎలాంటి పురోగతి లేదన్నారు. మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖకు రూ. 3143 కోట్లు కేటాయించిందని, ఇందులో వికలాంగుల సంక్షేమానికి ఎంత కేటాయించారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే. మల్లేశం, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యురాలు కే. కవిత, జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి, సహాయ కార్యదర్శి వెంకట్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జె. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# 23న ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

స్థానిక తారా ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాల, సంగారెడ్డిలో ఈనెల 23న, సోమవారం ప్రముఖ ఫార్మాస్యూటికల్ సంస్థ 'ఎంఎస్ఎన్ లాబొరేటరీస్' రుద్రారం ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్కేసీ) మరియు కెమిస్ట్రీ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఈనెల 23న ఉదయం 10 గంటల నుండి తారా ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో జరుగుతుందని పేర్కొన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ లేదా ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతున్న లేదా పూర్తి చేసిన అభ్యర్థులు, ఫైనల్ ఇయర్ చదువుతున్న లేదా పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ వెంట రెజ్యూమ్ మరియు విద్యార్హతల ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు ఇది మంచి ఉద్యోగావకాశమని, అర్హులైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ వీరేందర్, కెమిస్ట్రీ విభాగాధిపతి డా. వినోద్ కుమార్ గౌడ్ మరియు టీఎస్కేసీ కన్వీనర్ డా. సుచిత్ర సింగ్ తెలిపారు.

# చలివేంద్రం ప్రారంభం




**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

ఆందోల్ మండలం నేరడిగుంట గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం నేరడిగుంట ఎక్స్ రోడ్డులో చలివేంద్రాన్ని నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నేరడిగుంట ఎక్స్ రోడ్ నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో చుట్టూ పది గ్రామాల ప్రజలు వ్యాపార నిమిత్తం వస్తుంటారు. ఎండలు బాగా కొడుతుండటంతో సామాన్య ప్రజలు బాటిల్ వాటర్ ఇరవై రూపాయలు కొనలేక దాహంతో ఉండకూడదనే సంకల్పంతో చలి వేంద్రం ఏర్పాటు చేసి మట్టికుండలో మినరల్ వాటర్ అందజేస్తున్నామని నేతాజీ యువజన సంఘం నాయకులు తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి ముందుకు వచ్చిన నేతాజీ యువజన సంఘ సభ్యులను స్థానికులు అభినందించారు.

# కొనసాగుతున్న వంట గ్యాస్ కష్టాలు..

- ఏజెన్సీల ముందు భారీ క్యూలు

**ముద్ర న్యూస్ :**



వంట గ్యాస్ కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్యాస్ ఏజెన్సీల ముందర చాంతాడంత క్యూలు కనిపిస్తున్నాయి. నిజాంసాగర్‌లోని గ్యాస్ ఏజెన్సీ వద్ద శుక్రవారం ఉదయం నుంచే వినియోగదారులు బారులు తీరారు. నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా బాన్సువాడలో కార్యాలయం ఏర్పాటు చేసి తమకు గ్యాస్ అందకుండా చేస్తున్నారని వినియోగదారులు నిరసనకు దిగారు. బాన్సువాడలో అదనంగా వసూలు చేస్తూ సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్ఐ సాయిలు, జీపీవో శేఖర్ ఘటనాస్థలానికి చేరుకోగా వినియోగదారులు వారిని చుట్టుముట్టారు. తమ పేర్లపై సిలిండర్లు బుక్ చేస్తూ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. బాన్సువాడలో అక్రమంగా కార్యాలయం ఏర్పాటు చేసి సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నట్లు తేలింది. స్టాక్ పరిశీలనలో అసలు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయకుండా, తెల్లకాగితంపై బిల్లులు ఇస్తూ సిలిండర్లు అందిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్ఐ, ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

**నవీపేటలో బారులు..**

వంట గ్యాస్ కోసం నవీపేటలోని గ్యాస్ ఏజెన్సీ ఎదుట వినియోగదారులు నేడు కూడా బారులు తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుటెండలో వరుసలో నిల్చున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
**ముద్ర**
22.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మద్యం : ఆరోగ్య పరీక్షలు చేయించుకోండి**

కాలేయం, గుండె ఆరోగ్యంపై క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం మంచిది.





# పైలట్ కు షాక్

- **మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఫాంహౌస్ సీజ్**
- **భూ వివాదాలు కూడా కారణం..**
- **ఇటీవల డ్రగ్ పార్టీతో వివాదం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి మొయినాబాద్ ఫామ్‌హౌస్ వివాదం ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది. అజీజ్ నగర్‌లోని ఓ అసైన్డ్ భూమిని ఆక్రమించి ఫామ్‌హౌస్ కట్టారని ఆరోపణలు వచ్చాయి. బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌పై జరిగిన పోలీసుల దాడి, తదనంతర పరిణామాలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి.

**ఏం జరిగిందంటే..?**

మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్ పరిధిలో ఉన్న రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌పై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కార్యాకలాపాలకు నిలయంగా మారిందనే పక్కా సమాచారంతో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

**భూ వివాదం - రెవెన్యూ అధికారుల నివేదిక**

రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ నిర్మాణం చుట్టూ అనేక చట్టపరమైన చిక్కులు ఉన్నాయి. అజీజ్‌నగర్‌లోని సర్వే నంబర్ 177/33లో సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఫామ్‌హౌస్ నిర్మించారు. ఈ భూమిని 2006లో రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ప్రభుత్వ 'భూభారతి' రికార్డుల్లో ఈ భూమి జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూమిని విక్రయించడం లేదా రిజిస్ట్రేషన్ చేయడం చట్టవిరుద్ధం. అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది.?, దానికి సహకరించిన అధికారులు ఎవరు..? అనే కోణంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు.

**పోలీసుల చర్యలు..**

ఈ కేసులో పోలీసులు అత్యంత వేగంగా చర్యలు తీసుకున్నారు. రోహిత్ రెడ్డిని కస్టడీలోకి తీసుకున్న తర్వాత, నేరుగా ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్, విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న కార్యక్రమాలు, భూ అక్రమాలపై ఇప్పటికే రెవెన్యూ అధికారులకు పోలీసులు అధికారిక లేఖలు రాశారు.

**ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో రోహిత్ రెడ్డి కీలక పాత్ర..**

గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో రోహిత్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆయన ఇప్పుడు వరుసగా చట్టపరమైన ఇబ్బందుల్లో చిక్కుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అక్రమ నిర్మాణాలు, అసైన్డ్ భూముల ఆక్రమణలపై ప్రస్తుత ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోండటంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

# తిరుమలలో దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు

- **భక్తి, సేవలతో చంద్రబాబు కుటుంబం**
- **అన్నదానానికి రూ.44 లక్షల విరాళం**

**ముద్ర డెస్క్:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తిరుమల అంటే ఉన్న ఆధ్యాత్మిక అనుబంధం అందరికీ తెలిసిందే. చిన్ననాటి నుంచి శ్రీ వేంకటేశ్వర స్వామిపై గాఢమైన భక్తి కలిగిన ఆయన, జీవితంలోని ప్రతి ముఖ్య సందర్భాన్ని స్వామివారి ఆశీస్సులతోనే ప్రారంభించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. అలిపిరి వద్ద జరిగిన మావోయిస్టుల దాడి నుంచి ప్రాణాలతో బయటపడిన తర్వాత, స్వామివారి కృప వల్లే తనకు పునర్జన్మ లభించిందని ఆయన విశ్వసిస్తుంటారు. ఈ విశ్వాసంతోనే చంద్రబాబు కుటుంబం తరచూ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. ముఖ్యంగా కుటుంబ సభ్యుల పుట్టినరోజులను స్వామివారి సన్నిధిలో జరుపుకోవడం వారి కుటుంబ సంప్రదాయంగా మారింది. ఇటీవల ఆయన మనుమడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా తిరుమలలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. వేకువజామునే చంద్రబాబు కుటుంబ సభ్యులు తిరుమలకు చేరుకోగా, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్వయంగా తన మనుమడు దేవాన్ష్‌తో కలిసి భక్తులకు అన్నప్రసాదం వడ్డించడం విశేషంగా నిలిచింది. చిన్న వయస్సులోనే దేవాన్ష్ ఎంతో ఉత్సాహంగా భక్తులకు సేవ చేయడం చూసి అక్కడికి వచ్చిన వారంతా ఆనందం వ్యక్తం చేశారు. ఈ దృశ్యాన్ని చూసి చంద్రబాబు కూడా మురిసిపోయారు. ఈ సందర్భంగా తిరుమలలో రోజువారీ అన్నప్రసాద వితరణకు అయ్యే రూ.44 లక్షల వ్యయాన్ని ముందుగానే టీటీడీకి విరాళంగా అందజేశారు. ప్రతి ఏడాది దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఈ విధంగా అన్నదాన సేవ చేయడం చంద్రబాబు కుటుంబం కొనసాగిస్తున్న సాంప్రదాయం. అలాగే ఇటీవల నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా కూడా అన్నప్రసాద వితరణ కోసం విరాళాలు అందించారు. భక్తులకు ఆహారం అందించడం ద్వారా సేవ చేయడం అత్యున్నత పుణ్యంగా భావించే చంద్రబాబు కుటుంబం, ఆర్భాటాలకు దూరంగా, సేవా కార్యక్రమాల ద్వారానే వేడుకలను జరుపుకోవడం ప్రత్యేకతగా నిలుస్తోంది. మొత్తంగా, భక్తి, సేవ, సంప్రదాయం ఈ మూడు విలువలను కలగలిపిన ఈ వేడుకలు తిరుమలలో పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. చంద్రబాబు కుటుంబం చూపిస్తున్న ఈ సేవాభావం, భక్తులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.



# కాంగ్రెస్‌లో జీవన తరంగాలు

- **తగ్గని జీవన్ రెడ్డి..**
- **ఈ నెల 25న పార్టీకి గుడ్ బై..?**
- **రంగంలోకి దిగిన కాంగ్రెస్ అధిష్టానం..**
- **జీవన్ రెడ్డిని బుజ్జగించిన మంత్రులు**
- **తగ్గని సీనియర్ నేత**
- **తెరపైకి బీజేపీ సంప్రదింపులు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



పార్టీని వీడేందుకు సిద్ధమైన సీనియర్ నేత జీవన్ రెడ్డి వెనక్కి తగ్గడం లేదు. ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి ఆదేశాలతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ వెళ్లి బుజ్జగించినా ఆయన వినడం లేదని తెలుస్తోంది. దాదాపు 5 గంటలపాటు చర్చించారు. తన సొంత కేడర్ కు అన్యాయం జరుగుతుందని, తాను పార్టీలో ఉండనంటూ జీవన్ రెడ్డి తెగేసి చెప్పినట్లు సమాచారం. ఇదే విషయాన్ని మంత్రులు.. మీనాక్షికి చెప్పినట్లు పార్టీ కీలక నేత చెప్పారు. ఈ నెల 25న జీవన్ రెడ్డి పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారని అంటున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత సీనియర్ నాయకుడైన టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఆయనను బుజ్జగించేందుకు సీనియర్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. నలభై ఏళ్ల పాటు కాంగ్రెస్ జెండాను మోసిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి ఇప్పుడు పార్టీని వీడే దిశగా అడుగులు వేస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో తనకు చిరకాల ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం, ఆపై ఆయనకే ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తనకు పార్టీలో గౌరవం లేదని, అవమానాలు ఎదురవుతున్నాయని భావిస్తున్న ఆయన, ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్‌కు అధికారికంగా రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయన ఇంటి వద్ద కాంగ్రెస్ ఫ్లెక్సీలను అనుచరులు తొలగించడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది.

**మంత్రుల బుజ్జగింపులు - తగ్గని జీవన్ రెడ్డి**

జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయనతో గంటల తరబడి చర్చలు జరిపారు. పార్టీలో మీ ప్రాధాన్యత తగ్గదు, తగిన గుర్తింపు ఇస్తాం అని మంత్రులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, ఆయన మనసు మార్చుకోలేదని తెలుస్తోంది. తన సొంత కేడర్‌కు అన్యాయం జరుగుతున్నప్పుడు పదవుల్లో కొనసాగడం వృథా అని ఆయన మంత్రుల వద్ద కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ భేటీ నిష్ఫలమైందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

**బీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం**

ఈ పరిణామాల నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు జీవన్ రెడ్డిపై కన్నేశాయి. అటు బీఆర్ఎస్ , ఇటు బీజేపీ ఆయనను తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో జీవన్ రెడ్డి టచ్‌లోకి వెళ్లారని, 25న రాజీనామా చేసిన వెంటనే జగిత్యాలలో భారీ బహిరంగ సభ ద్వారా గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ కూడా జీవన్ రెడ్డి సీనియారిటీని గౌరవించి, ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి.


**సంప్రదింపులు జరుపుతున్న బీజేపీ**

బీజేపీ కూడా ఆయన వంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకుడి కోసం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. కరీంనగర్ రీజియన్‌లో జీవన్ రెడ్డికి ఉన్న పట్టును గమనించి, ఆయనను తమ వైపు తిప్పుకుంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తిరుగుండదని కమలనాథులు భావిస్తున్నారు. మొత్తానికి జగిత్యాల రాజకీయాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠను రేపుతున్నాయి.

# చంద్రబాబుతో మమతకు చెక్..

- **బీజేపీ మాస్టర్ ప్లాన్!**

**ముద్ర డెస్క్ :**





ఎన్డీఏ లో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు అవసరమైన ఎంపీల బలాన్ని అందించగలిగింది. అందుకే కేంద్ర పెద్దలు తెలుగుదేశం పార్టీని బలమైన నమ్మదగిన మిత్రుడిగా భావిస్తున్నారు. అందుకే ఏపీ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. రాజకీయంగాను పరస్పర సహకారం అందుతోంది ఏపీకి. మరోవైపు సీఎం చంద్రబాబుకు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు బీజేపీ పెద్దలు. అయితే తాజాగా చంద్రబాబుకు కీలక బాధ్యతలు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్లో ఎన్నికల ప్రచారానికి ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు సమాచారం. రెండు నుంచి మూడు రోజుల పాటు చంద్రబాబు పశ్చిమ బెంగాల్ లో ఎన్నికల ప్రచారం చేస్తారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.

**ఐదు రాష్ట్రాల ఎన్నికలు..**

మే నెలలో దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, అస్సాములలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సన్నాహాలు ప్రారంభించింది. ఎన్నికల నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. అయితే ఈ ఐదు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీకి పశ్చిమ బెంగాల్, అస్సాం కీలకం. ప్రస్తుతం అస్సాంలో బీజేపీ అధికారంలో ఉంది. పశ్చిమ బెంగాల్లో మమతా బెనర్జీని ఓడించి అధికారంలోకి రావాలని గట్టిగానే ప్రయత్నిస్తోంది. అయితే పశ్చిమ బెంగాల్లో గెలవడం అంత సులభం కాదు. అందుకే అక్కడ బీజేపీ సర్వశక్తులను వడ్డాలని భావిస్తోంది.

**బెంగాల్ లో విజయమే లక్ష్యం..**

మమత బెనర్జీ వరుసగా రెండుసార్లు బెంగాల్లో అధికారం చేపట్టి హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ ను ఎదిరించి సొంతంగా పార్టీని ఏర్పాటు చేశారు మమత బెనర్జీ. వామపక్షాలను కూకటి వేళ్లతో పెకిలించి తన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే దేశంలో వరుసగా మూడుసార్లు అధికారం చేపట్టిన బీజేపీ బెంగాల్లో జెండా పాతాలని చూస్తోంది. కానీ మమత బెనర్జీ బలం ముందు, వ్యూహాల ముందు నిలబడలేక పోతోంది. అయితే ఈసారి మాత్రం ఎలాగైనా విజయం సాధించేందుకు చాలా రకాల వ్యూహాలు పన్నుతోంది. ఏ చిన్న అవకాశం వచ్చిన జారవిడుచుకునేందుకు ఇష్టపడడం లేదు.

**ప్రత్యేక ఆహ్వానం..**

చంద్రబాబును ప్రచారంలోకి తెచ్చి మమత బెనర్జీని దెబ్బతీయాలన్నది కేంద్ర పెద్దల వ్యూహంగా తెలుస్తోంది. గతంలో చంద్రబాబుకు రాజకీయంగా అత్యంత సన్నిహితురాలిగా ఉండేవారు మమతా బెనర్జీ. గతంలో చంద్రబాబు ఆమెకు మద్దతుగా ప్రచారం కూడా చేశారు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బీజేపీకి మమతా బెనర్జీ వ్యతిరేకమయ్యారు. చంద్రబాబు దగ్గరయ్యారు. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్లో చంద్రబాబుతో ప్రచారం చేయిస్తే వర్కౌట్ అవుతుందని బీజేపీ ఆలోచన. మరోవైపు బెంగాల్లో తెలుగు ప్రజలు అధికంగా నివసిస్తున్నారు. వారు చంద్రబాబు నాయకత్వంపై సానుకూలంగా ఉంటారు. అందుకే చంద్రబాబును ప్రచారం చేయించడం ద్వారా బీజేపీ వీలైనంత ఎక్కువ సీట్లు పొందేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చంద్రబాబుకు ఆహ్వానం అందిందని.. ఆయన ఓ మూడు రోజుల పాటు పశ్చిమ బెంగాల్లో ప్రచారం చేయడం ఖాయమని సమాచారం. చూడాలి మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ట్రిపుల్ ఆర్ స్పీడ్

- **బడ్జెట్ లో ఈసారి ఫండ్స్**
- **పనులు వేగవంతమయ్యే అవకాశం**
- **బడ్జెట్‌లో ఆర్అండ్‌బీ శాఖకు భారీ కేటాయింపులు**
- **40 శాతం పెరిగిన కేటాయింపులు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ట్రిపుల్ ఆర్ పనులు వేగవంతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ బడ్జెట్ 2026 27లో రోడ్లుభవనాల శాఖకు రూ.8,298 కోట్లు కేటాయించారు. ఇది గత ఏడాది కంటే 40.4 శాతం అధికం. ముఖ్యంగా రీజినల్ రింగు రోడ్డు భూసేకరణకు రూ.1,525 కోట్లు, హ్యామ్ మోడల్ రహదారులకు రూ.3,053 కోట్లు కేటాయించారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా, ఈ నిధులతో రీజినల్ రింగు రోడ్డు పనులు వేగవంతం కానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం 202627 బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం.. గత బడ్జెట్ కంటే ఈసారి రోడ్లుభవనాల శాఖకు ఏకంగా 40.4 శాతం నిధులను పెంచింది. గత ఏడాది రూ.5,907 కోట్లు కేటాయించగా.. ఈసారి ఆ మొత్తాన్ని రూ.8,298 కోట్లకు పెంచారు. హైదరాబాద్ నగరం చుట్టూ సుమారు 340 కిలోమీటర్ల మేర నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగు రోడ్డు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అత్యంత కీలకమైన ఉత్తర, దక్షిణ భాగాల భూసేకరణ కోసం ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.1,525 కోట్లను కేటాయించింది. దీంతో భూసేకరణ ప్రక్రియ మరింత వేగం పుంజుకోనుంది. భూసేకరణకు రూ.1,928 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలు పంపించగా బడ్జెట్‌లో రూ.1,525 కోట్లు కేటాయించారు. సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవ్‌పూర్, భువనగిరి, చౌటుప్పల్ వంటి కీలక పట్టణాలను కలుపుతూ ఉత్తర భాగం పనులు చేపట్టనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నిర్మించే ఈ రహదారి వల్ల కొత్త పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్ హబ్‌లు ఏర్పాటు కానున్నాయి. దాంతో పాటుగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాలు నగరం లోపలికి రాకుండానే ఇతర రాష్ట్రాలకు వెళ్లే వెసులుబాటు కలుగుతుంది.

2026-27 బడ్జెట్‌లో రూ.3,053 కోట్లు హ్యామ్ రోడ్లకే కేటాయించడం విశేషం. తెలంగాణలో మొత్తం 5,824 కి.మీ. మేర హ్యామ్ రోడ్లకు రూ.11,399 కోట్లు అవసరం కాగా... కొత్త ఆర్థిక సంవత్సరంలో రూ.3,053 కోట్లు కేటాయించారు. సీఆర్ఐఎఫ్ పథకంలో భాగంగా 34 హైవేల పనులను రూ.868 కోట్లతో చేపట్టనున్నారు. రాష్ట్రం సొంత నిధులతో ఈ పనులను చేపడితే ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. సీఆర్ఐఎఫ్ పథకం కోసం బడ్జెట్‌లో రూ.243 కోట్లను కేటాయించారు. దీంతో ఈ పనులు వేగం పుంజుకోనున్నాయి. దాంతో పాటు భవనాల విభాగానికి రూ.650 కోట్ల ప్రతిపాదనలు పంపించగా సచివాలయ భవన పాత బిల్లులకు రూ.100 కోట్లను కేటాయించారు. ఇక వరంగల్ ఎయిర్‌పోర్టు భూసేకరణ, పునరావాసానికి గతంలో రూ.295 కోట్లు కేటాయించగా.. ఇటీవల అదనంగా మరో రూ.90 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలోనే భూ సేకరణ పూర్తి చేసి నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్‌ప్లాన్ పూర్తి చేస్తామని వెల్లడించింది.

మద్యం : మెల్లగా తాగే అలవాటు చేసుకోండి

వేగంగా తాగడం కంటే నెమ్మదిగా తాగితే మోతాదు తగ్గించుకోవచ్చు.

# గ్యాస్ వినియోగదారులకు కేంద్రం ఊరట

- గ్యాస్ కొరతకు చెక్.. సరఫరా 20% పెంపు
- హోటళ్లు, పరిశ్రమలకు ప్రాధాన్యత
- వలస కార్మికులకు ఉచిత సిలిండర్లు
- రిజిస్ట్రేషన్ తప్పనిసరి.. కేంద్రం కొత్త నిబంధనలు

**ముద్ర డెస్క్ :**
దేశవ్యాప్తంగా నెలకొన్న గ్యాస్ కొరత సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. అంతర్జాతీయంగా ఇరాన్, ఇజ్రాయెల్ , అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల ప్రభావంతో భారత్‌లో గత మూడు వారాలుగా గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో హోటళ్లు, రెస్టారెంట్లు , చిన్న తరహా పరిశ్రమలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు కేంద్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను తక్షణమే 20 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గ్యాస్ కొరత కారణంగా అనేక రెస్టారెంట్లు, డాబాలు , హోటళ్లు మూతపడే పరిస్థితి రావడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. పెంచిన సరఫరాలో మొదటగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఇండస్ట్రియల్ క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు , డైరీ యూనిట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. అలాగే వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నడిపే సబ్సిడీ క్యాంటీన్లకు కూడా గ్యాస్ కొరత లేకుండా చూడాలని స్పష్టం చేసింది.మరోవైపు వలస కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. వలస కార్మికులకు 5 కిలోల గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు కేంద్రం లేఖలు రాసింది. ఈ ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రక్రియ ఎల్లుండి (మార్చి 23) నుంచి ప్రారంభం కానుంది. గ్యాస్ వినియోగంలో ఎటువంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు కేంద్రం కొన్ని నిబంధనలను విధించింది. కమర్షియల్ యూజర్లు , వలస కూలీలు సంబంధిత యాప్‌ల ద్వారా లేదా గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరని తెలిపింది. దేశంలో గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని, కేవలం సరఫరాను క్రమబద్ధీకరించడానికే ఈ చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# యువకుడి మరణం.. 8మందికి ప్రాణదానం

**కన్న కొడుకు అవయవాలు దానం చేసిన తల్లిదండ్రులు**



**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**
అల్లారుముద్దుగా పెంచుకున్న కన్న కొడుకు ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. కానీ ఆ తల్లిదండ్రులు మరో నలుగురిలో తమ కొడుకుని చూసుకోవాలని అవయవదానానికి సిద్ధమయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 17న గద్వాల రైల్వే స్టేషన్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న సంఘటనలో బైక్ పై వెళ్తున్న అయిజ పట్టణానికి చెందిన రాము సంఘటనా స్థలంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ రోడ్డు ప్రమాదంలో మిట్టదొడ్డి గ్రామానికి చెందిన బెల్లంకొండ విష్ణు చైతన్య గుప్తా (17) తీవ్రంగా గాయపడ్డాడు. మరో విద్యార్థి గద్వాలకు చెందిన వర్ధన్ కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన విష్ణుచైతన్యను హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. తమ కుమారుడు మరణం మరో నాలుగు కుటుంబాల్లో వెలుగులు నింపాలని మృతుడి తండ్రి బెల్లకొండ నాగరాజుశెట్టి దంపతులు అవయవ దానం చేయాలని నిర్ణయించుకున్నారు. తమ కుమారుడి మరణానంతరం కూడా 8 ప్రధాన అవయవాలు, 50కి పైగా టిష్యూ భాగాలను దానం చేసి, 8 మంది ప్రాణాలను కాపాడి పలువురికి ఆదర్శంగా నిలిచారు. తుది లాంచనాలు చేసి యువకుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా శనివారం సాయంత్రం మిట్టదొడ్డి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

# 'గరికపాటి' గుడ్డు వివాదం

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను శోభన పెళ్లికొడుకులతో పోల్చిన నర్సింహారావు
- వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు
- వీడియోను పూర్తిగా వినాలని క్లారిటీ ఇచ్చిన గరికపాటి బృందం



**ముద్ర డెస్క్ :**
ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి మరో వివాదంలో చిక్కుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులను శోభనం పెళ్ళికొడుకులతో పోల్చడం.. కోడిగుడ్లతో భోజనం పెట్టడం వంటి వాటిని ప్రస్తావిస్తూ గరికపాటి చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు గురిచేస్తున్నాయి. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలతో పాటు విమర్శలు వస్తున్నాయి. ఈ తరుణంలో గరికపాటి బృందం రంగంలోకి దిగింది. దీనిపై వివరణ కూడా ఇచ్చింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇదే వైరల్ అవుతోంది. నెటిజన్లు భిన్నంగా కామెంట్లు పెడుతున్నారు. అయితే తరచూ ఏదో ఒక వివాదంలో గరికపాటి చిక్కుకోవడం చూస్తుంటే మాత్రం వింత గొలుపుతోంది.

**గతంలో కూడా..**
గరికపాటి నరసింహారావు వివాదాల్లో చిక్కుకోవడం కొత్త కాదు. అప్పట్లో మెగాస్టార్ చిరంజీవి విషయంలో ఆయన చేసిన కామెంట్స్ విపరీతంగా వైరల్ అయ్యాయి. మెగా అభిమానులకు కోపం తెచ్చి పెట్టాయి. ఎంతో హుందాగా ఉండే చిరంజీవిని ఓ వేదికపై అగౌరవంగా వ్యాఖ్యానాలు చేయడం పై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. మెగా అభిమానులు స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు. మెగా బ్రదర్ నాగబాబు అయితే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కానీ చిరంజీవి ప్రమేయంతో అప్పట్లో ఆ వివాదం సద్దుమణిగింది. అయితే ఇప్పుడు మధ్యాహ్న భోజనం, విద్యార్థుల చదువులు, ఉపాధ్యాయుల బోధనేతర కార్యక్రమాలు తదితర విషయాలపై కామెంట్స్ చేశారు గరికపాటి. అవి ఇప్పుడు పెను దుమారానికి దారితీస్తున్నాయి.

**క్లారిటీ ఇచ్చిన గరికపాటి బృందం**
ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు చదువుతుండగా.. వారికోసం ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం నడిపిస్తోంది. అయితే యధాలపంగా దానిని తప్పు పట్టారు గరికపాటి నరసింహారావు. కోడిగుడ్లు పెడతారు. కడుపునిండా భోజనం పెడతారు. శోభనం పెళ్ళికొడుకు మాదిరిగా తయారు చేస్తారు. ఉపాధ్యాయులు ఏమో లెక్కలు చూస్తారు.. ఇలా గరికపాటి వ్యాఖ్యానాలు కొనసాగాయి. అయితే పేద ప్రజలతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులను కించపరుస్తారా అంటూ... సోషల్ మీడియాలో గరికపాటి పై ముప్పేట దాడి జరుగుతోంది. దీనిపై స్పందించింది గరికపాటి బృందం. గరికపాటి వీడియోను పూర్తిస్థాయిలో వినాలని.. ఎవరో క్లిప్పులు పెట్టి తప్పుదారి పట్టించారని స్పష్టతనిచ్చింది. గరికపాటి ఎటువంటి తప్పుడు వ్యాఖ్యానాలు చేయలేదని తేల్చి చెప్పింది.

# బీజేపీ బలం తగ్గుతోందా...!

- పాలమూరు లోకసభ నియోజకవర్గం లో తగ్గిన ప్రాభవం
- ఏడు నియోజకవర్గాల్లో కనిపించని ఎంపీ నిధుల అభివృద్ధి
- ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యే లు ఉన్నా బీజేపీ అభ్యర్థి ని గెలిపించిన నియోజకవర్గ ప్రజలు
- ఇప్పటి వరకు ఒక్క నియోజకవర్గం లో కేంద్ర నిధులతో అభివృద్ధి శూన్యం
- ఎంపీ డీకే అరుణ పర్యటనలకే పరిమితం
- అభివృద్ధి కి పైసా విదిలించని ఎంపీ.. ఏడు నియోజకవర్గ ప్రజల ఆశలపై నీళ్లు





**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

పాలమూరు లోక్‌సభ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలహీన పడుతోందా.. ఈ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కేంద్ర నిధులు పైసా విదిలించలేదా.. బీజేపీ శ్రేణులు కూడా ఉత్సాహాన్ని కోల్పోయారా.. అని అంటే అన్నింటికీ సమాధానం అవుననే వినిపిస్తోంది. ఈ లోకసభ నియోజకవర్గం పరిధిలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కొడంగల్ కూడా ఉంది. ఇదే కాకుండా మరో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు మహబూబ్ నగర్, దేవరకద్ర, మక్తల్, నారాయణ పేట, జడ్చర్ల, షాద్ నగర్ ఈ లోక్‌సభ పరిధిలో ఉన్నాయి. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయ కేతనం ఎగురవేసింది. ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యే లు గెలుపొందినా 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. ఈ నియోజకవర్గం ప్రజలు ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీ ని కాదని బీజేపీ కి పట్టం కట్టారు. ఏడుగురు ఎమ్మెల్యే లు కాంగ్రెస్ పార్టీ కి ఉంటే ఇక్కడ బీజేపీ ఎలా గెలిచిందని కాంగ్రెస్ అధిష్టానం తో పాటు విశ్లేషకులు ఆశ్చర్య పోయారు. అప్పట్లో ఈ ఏడుగురు ఎమ్మెల్యేల పై సీఎం రేవంత్ రెడ్డి సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్చర్ల, షాద్ నగర్, కొడంగల్ నియోజకవర్గాల్లో మాత్రమే కాంగ్రెస్ పార్టీ కి కొంత అధిక్యం వచ్చింది. మిగతా నాలుగు నియోజకవర్గాల్లో బీజేపీ మెజార్టీ సాధించింది. నారాయణ పేట అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ కి 19 వేల పైనే మెజారిటీ వచ్చింది. మొత్తంగా చూస్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీ చంద్ రెడ్డి పై 4,499 ఓట్ల తేడా తో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపొందారు. కేవలం ఈ లోక్ సభ నియోజకవర్గంలో నాలుగు సార్లు ప్రచారం నిర్వహించారు. అయినా ఫలితం రాకపోవడంతో ఇక్కడి ఎమ్మెల్యేల తీరు పై మండి పడ్డారు. నారాయణ పేట మినహా ఉనికి లేని బీజేపీ విజయం సాధించిందంటే కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యే లు పట్టించుకోలేదనే ఆరోపణలు అప్పట్లో చాలా వచ్చాయి. వంశీ చంద్ రెడ్డి కి ఏఐసీసీ తో పాటు రాహుల్ గాంధీ తో స్నేహ సంబంధాలు ఉండడంతో ఆయన ఇక్కడ ఎంపీ గా గెలుస్తే తమ ఉనికి పోతుందనే భయంతో ఎమ్మెల్యే లు లోలోపల బీజేపీ కి మద్దతు ఇచ్చారనే ఆరోపణలు కూడా వచ్చాయి. బీజేపీ నుంచి ఎంపీ గా గెలిచిన డీకే అరుణ ఈ ఏడు నియోజకవర్గాల్లో ఒక్క అభివృద్ధి పని చేయలేదనే ఆరోపణలు మూటగట్టుకున్నారు. కేవలం పర్యటనలకే పరిమితమైన ఎంపీ, అభివృద్ధి కోసం కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా తీసుకురాలేదని ప్రజలతో పాటు పార్టీ శ్రేణులు కూడా విమర్శిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు జరిగి మరో రెండు నెలల్లో రెండేళ్ల కాలం పూర్తవుతుంది. ఈ 22 నెలల కాలం లో ఈ ఏడు నియోజకవర్గాల్లో బీజేపీ చేసిన అభివృద్ధి శూన్యం అని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఎంపీ డీకే అరుణ ఒక్కరే ఈ ఏడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఒక్క నారాయణ పేట మున్సిపాలిటీ లో మాత్రమే బీజేపీ విజయం పొందింది. అదికూడా ఎంపీ ఎక్స్ అఫిషియో ఓటుతో బీజేపీ గట్టెక్కింది. ఎంపీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం లో భారీ మెజారిటీ సాధించిన బీజేపీ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటమి అంచునుంచి కాస్త బయటపడింది. ఈ ఏడు నియోజకవర్గాల్లో పది నెలల్లో బీజేపీ ప్రభావం పూర్తిగా పడిపోయింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే లు ఎంపీ ని పట్టించుకోవడం లేదనే విమర్శలు లేకపోలేదు. కేంద్రం నుంచి నిధులు తెస్తే ఎంపీ నిధుల కోసం ఎమ్మెల్యే లు ఎదురు చూసేవారు. ప్రస్తుతం ఎంపీ నిధులు ఖర్చు చేయకపోవడంతో ఎమ్మెల్యే లు ఎంపీ ని అస్సలు పట్టించుకోవడం లేదు. ఎంపీ డీకే అరుణ కూడా ఈ నియోజకవర్గాలో ని ఎమ్మెల్యేలను పట్టించుకోకుండా పర్యటిస్తున్నారు. ఎమ్మెల్యే లు కూడా ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంపీ కి సమాచారం ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. ఎంపీ తో కలిసి అభివృద్ధి పనుల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే సుముఖంగా లేరనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఏది ఏమైనా రోజు రోజుకు బీజేపీ ప్రాభవం తగ్గిపోతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

**ఈ లోక్‌సభ నియోజకవర్గం ప్రత్యేకత**
తెలంగాణలోని ముఖ్యమైన పార్లమెంట్ నియోజకవర్గం మహబూబ్ నగర్. 2007లో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ ప్రకారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం ఏర్పడింది. ఈ లోక్‌సభ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అంతకుముందు దీని పరిధిలో ఉన్న అలంపూర్, గద్వాల, వనపర్తి నియోజకవర్గాలను నాగర్‌కర్నూలు లోక్‌సభ నియోజకవర్గంలో కలిపారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలో నారాయణపేట, మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్, షాద్‌నగర్, కొడంగల్ శాసనసభ నియోజకవర్గాలున్నాయి.

- 1952లో తొలిసారిగా లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన పులి రామస్వామి విజయం సాధించారు. ఈ స్థానానికి ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి.11 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. మూడుసార్లు టీఆర్ఎస్, రెండు పర్యాయాలు జనతా పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఇక్కడి నుంచి ఎంపీగా విజయం సాధించిన కాంగ్రెస్ సీనియర్ నేత ఎస్. జైపాల్ రెడ్డి కేంద్ర మంత్రిగా పనిచేశారు.

- 2019లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానం నుంచి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్ రెడ్డి విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి బీజేపీ నుంచి పోటీ చేసిన డీకే అరుణపై 77,829 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మన్నె శ్రీనివాస్ రెడ్డికి 4,11,402 ఓట్లు రాగా, డీకే అరుణకు 3,33,573 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వంశీచంద్ రెడ్డి 1,93,631 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు.

- 2009లో బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఇక్కడి నుంచి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ నేత దేవరకొండ విట్టల్ రావుపై 20 వేల కుపైగా మెజార్టీతో కేసీఆర్ విజయం సాధించారు. 2009 నుంచి వరుసగా టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తున్నా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిపత్యాన్ని కనబరిచింది. 2024 లో మాత్రం బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపొందారు. కెసిఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరికి మహబూబ్ నగర్ తో ఎక్కువ సంబంధం ఉంది. ఇక్కడి నుంచి ఎంపీ హోదా లో ఉండి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన చేసిన కేసీఆర్ అనంతరం సీఎం అయ్యారు. ఇదే లోక్ సభ పరిధిలోని కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే గా ఎన్నికైన రేవంత్ రెడ్డి సీఎం కావడం గమనార్హం. అందుకే ఈ లోక్‌సభ నియోజకవర్గం ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది.

# వాహనదారులకు బిగ్ రిలీఫ్

- రెండో వాహనం కొంటే అదనపు ట్యాక్స్ కు బ్రేక్
- ఈ నెల 23 నుంచి వాహన్ లో తెలంగాణ




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఇప్పటికే ఒక వాహనం ఉండి.. మరో వాహనం కొనుగోలు చేయాలనుకునే వారికి గుడ్‌న్యూస్. రెండో వాహనం రిజిస్ట్రేషన్‌పై అదనంగా విధిస్తున్న 2 శాతం లైఫ్ ట్యాక్స్‌ను రద్దు చేయబోతున్నట్లు తెలంగాణ రవాణా శాఖ ప్రకటించింది. ఈ తాజా నిర్ణయం మార్చి 23 నుంచి అమల్లోకి వస్తుందని అధికారులు వెల్లడించారు.

రాష్ట్ర వాహనాల డేటాను కేంద్ర ప్రభుత్వ 'వాహన్' పోర్టల్‌తో మంత్రి పొన్నం ప్రభాకర్ అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పెరగడమే కాకుండా జాతీయ డేటాబేస్‌లో తెలంగాణ వాహనాల వివరాలు అందుబాటులోకి వస్తాయి. రాష్ట్రంలో ప్రజలకు పాదదర్శక, వేగవంతమైన సేవల్ని అందించబోతున్నామని రవాణాశాఖ అధికారులు తెలిపారు. ఇందుకు వీలు కల్పించే కేంద్ర ప్రభుత్వ వాహన్ పోర్టల్‌తో తెలంగాణలోని వాహనాల డేటాబేస్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 23న జరిగే కార్యక్రమంలో అనుసంధానం చేస్తారని చెప్పారు. వాహన్ పోర్టల్ ద్వారా దేశవ్యాప్త వాహనాల సమాచారం ఒకే చోట లభ్యమవుతుందని వెల్లడించారు. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం సొంత ఐటీ వ్యవస్థపైనే ఆధారపడటంతో జాతీయ నెట్‌వర్క్‌కు దూరంగా ఉంది. తాజాగా కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ 'వాహన్' పోర్టల్‌లో చేరేందుకు రెడీ అయింది. ఇప్పటికే లైసెన్సుల జారీ కోసం సారథి పోర్టల్ అమలు చేయగా, ఇప్పుడు వాహన రిజిస్ట్రేషన్ల కోసం కొత్తగా వాహన్‌ను అనుసంధానించనుంది. దీంతో అంతరాష్ట్ర వాహనాల కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ ఈజీ కానుంది. తెలంగాణలో రిజిస్టర్ అయిన వాహనాన్ని ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లినా, అక్కడి వారు ఇక్కడ వాహనాలను కొనుగోలు చేసినా అవసరమైన పత్రాల కోసం గతంలో ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇక నుంచి వాహన్ పోర్టల్ ద్వారా కేంద్ర సర్వర్‌లో డేటా అందుబాటులో ఉంటుంది. దీన్ని వల్ల ఎన్ఓవో వంటి సాంకేతిక ప్రక్రియలు సెకన్ల వ్యవధిలోనే ఆన్‌లైన్ వేదికగా పూర్తి కానున్నాయి. దాంతో పాటు వెహికల్ యజమాని అడ్రస్ మార్పు, డూప్లికేట్ ఆర్సీ, రిమూవల్ వంటి పనులు ఆర్టీఏ ఆఫీసులకు వెళ్లకుండా నేరుగా ఆన్‌లైన్‌లోనే చేసుకోవచ్చు. ఎవరైనా సెకండ్ హ్యాండ్ వెహికల్స్ కొనుగోలు చేయాలనుకుంటే ఆ వాహనం గత చరిత్ర, పెండింగ్ చలాన్లు, ఇంజిన్ ఛాసిస్ నంబర్లను సులభంగా సరిచూసుకోవచ్చు. రోడ్ ట్యాక్స్ చెల్లింపులు, ఈచలానాల ప్రక్రియ కూడా వేగవంతం అవుతుంది. వాహన్ పోర్టల్‌లో చేరటం వల్ల నేర నియంత్రణలోనూ పోలీసులకు వెసులుబాటు కలుగుతుంది. చోరీకి గురైన వాహనాలు ఇతర రాష్ట్రాల్లో అమ్మకానికి వచ్చినా వాటి గుర్తింపు వెంటనే తెలుస్తుంది.

# ఇరాన్ కు ట్రంప్ బంపర్ ఆఫర్

**యుద్ధం వేళ ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేసిన అమెరికా**

**ముద్ర, డెస్క్ :**
యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించేందుకు మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.



# రామచంద్రుని సేవలో మంత్రి జూపల్లి


- బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ
- ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:**

జిల్లా చారకొండ మండలంలోని రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్ల క్షేత్రం శనివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించి సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, దేవస్థాన అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే స్వామివారి బ్రహ్మోత్సవాల గోడ పత్రికను (పోస్టర్) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న పలు మౌలిక సదుపాయాల పనులకు భూమిపూజ చేశారు.రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని, సిర్సనగండ్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం :ఒత్తిడి వల్ల తాగడం తగ్గించండి
ఎమోషనల్‌గా ఉన్నప్పుడు తాగడం అలవాటు చేసుకోవద్దు. అది అలవాటుగా మారే ప్రమాదం ఉంది.



## పాక్ క్రికెట్‌లో ‘టాక్సిక్ కల్చర్’

**గ్యారీ కిర్‌స్టెన్ సంచలన వ్యాఖ్యలు**

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (PCB) తీరుపై ఆ జట్టు మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాక్ క్రికెట్‌లో ప్రొఫెషనలిజం లేదని, అక్కడ ‘టాక్సిక్ వర్క్ కల్చర్’ నెలకొందని ఆయన విమర్శించారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, బోర్డు వ్యవహారాల్లో బాహ్య వ్యక్తుల జోక్యం ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల కోచ్‌లకు స్వయం ప్రతిపత్తి ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జట్టు వైఫల్యాలకు అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించకుండా, కోచ్‌లను బలిపశువులను చేయడం పాక్‌లో ఆనవాయితీగా మారిందని ఆయన ఆరోపించారు. ఆటగాళ్లలో సహజ ప్రతిభ ఉన్నప్పటికీ, సరైన మార్గదర్శకత్వం మరియు పారదర్శక వ్యవస్థ లేకపోవడం వల్ల అది వృధా అవుతోందని కిర్‌స్టెన్ పేర్కొన్నారు. వృత్తిపరమైన స్వేచ్ఛ, గౌరవం లేకపోవడం వల్లే తాను రాజీనామా చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. పాక్ కోచ్ పదవి నుంచి తప్పుకున్న కిర్‌స్టెన్, ఈ ఏడాది ఏప్రిల్ 15న శ్రీలంక జట్టు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో భారత్‌కు ప్రపంచకప్ అందించిన ఆయన, శ్రీలంక క్రికెట్‌ను ఏ విధంగా మారుస్తారోనని క్రీడాలోకం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.






## IPL 2026: ఆ జట్ల కు కోలుకోలేని షాక్!

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ ఇంకా ప్రారంభం కాలేదు. ఈసారి అన్ని జట్లు ప్లేయర్ల విషయంలో జాగ్రత్త పాటించాయి. బౌలర్లు.. స్టార్ బ్యాటర్లు.. ఆల్ రౌండర్లను కొనుగోలు చేశాయి. ఫలితంగా ఈసారి పోటీ అత్యంత రసవత్తరంగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. డొమెస్టిక్ క్రికెట్ లో సత్తా చూపించిన ప్లేయర్లకు ఈసారి అన్ని జట్లు అవకాశాలు కల్పించే సూచనలు కనిపిస్తున్నాయి. ఐపీఎల్ లో విదేశీ ప్లేయర్లు కూడా సందడి చేస్తుంటారు. అయితే ఈసారి టోర్నీ ప్రారంభానికి ముందుగానే భారీ అంచనాలు ఉన్న విదేశీ బౌలర్లు గాయపడ్డారు. దీంతో వారు ఏకంగా టోర్నీకే దూరమయ్యే అవకాశం ఉంది. రాజస్థాన్ జట్టు తరఫున సామ్ కరణ్ ఆడుతున్నాడు. ఇంగ్లాండ్ జట్టు ప్లేయర్ అయిన ఇతడు.. గాయపడ్డాడు. దీంతో అతడు టోర్నీ మొత్తానికి దూరమవుతాడని తెలుస్తోంది. ఒకరకంగా రాజస్థాన్ జట్టుకు ఇది భారీ దెబ్బ.. కరణ్ ఇటీవల టి20 వరల్డ్ కప్ లో అదరగొట్టాడు.. ఇంగ్లాండ్ జట్టు తరఫున మెరుగైన ఇన్నింగ్స్ ఆడాడు. అయితే అతడు గాయపడడంతో రాజస్థాన్ జట్టు మెరుగైన ఆల్‌రౌండర్‌ను కోల్పోయింది. పంజాబ్ జట్టు కూడా ఇటువంటి ఇబ్బందినే ఎదుర్కొంటోంది. పంజాబ్ జట్టు కు ఫెర్గు సన్ దూరమయ్యాడు. న్యూజిలాండ్ జాతీయ జట్టుకు చెందిన ఈ ఆటగాడు.. బౌలింగ్ తో పాటు.. బ్యాటింగ్ కూడా చేస్తాడు. ఇతడికి ఎటువంటి గాయం కాకపోయినప్పటికీ.. ఇటీవల అతడు తండ్రి కావడం.. బిడ్డతో గడిపేందుకు స్వదేశానికి వెళ్ళాడు. దీంతో ప్రారంభంలో అతడు కొన్ని మ్యాచ్లకు దూరమయ్యే అవకాశం ఉంది. ఇక బెంగళూరు జట్టు కు కోలుకోలేని దెబ్బ తగిలింది.. ఈ జట్టులో కీలకమైన బౌలర్గా ఉన్న హెజిల్ వుడ్ గాయం కావడంతో టోర్నీ మొత్తానికి దూరమైనట్టు తెలుస్తోంది. అతడు గత సీజన్లో అదరగొట్టాడు. బెంగళూరుకు అద్భుతమైన విజయాలు అందించాడు. అతడు గాయపడిన నేపథ్యంలో.. బెంగళూరు బౌలింగ్ తీవ్రంగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సారథిగా ఉన్న కమిన్స్ గాయపడ్డాడు. కొంతకాలంగా అతడు తీవ్రమైన వెన్ను నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో మెరుగైన చికిత్స కోసం అతడు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాడు. యాషెస్ సిరీస్ లో ఒకే మ్యాచ్ మాత్రమే ఆడాడు కమిన్స్. టి20 వరల్డ్ కప్ మొత్తానికి దూరమయ్యాడు. ఇప్పుడు హైదరాబాద్ జట్టుకు దూరం మాత్రమే కాదు.. కెప్టెన్సీ నుంచి కూడా తప్పుకున్నాడు. అయితే హేజిల్ వుడ్, కమిన్స్ గాయపడిన నేపథ్యంలో.. వారు టోర్నీ మొత్తానికి దూరం కాలేదని.. కొన్ని మ్యాచ్లు మాత్రమే ఆడరని.. ఆ తర్వాత వారు ఆయా జట్లకు అందుబాటులోకి వస్తారని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు.



## IPL 2026: ఈసారి పంజాబ్‌కు టైటిల్ దక్కుతుందా? ఆశలు గట్టిగా..

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు ట్రోఫీ అందుకోలేకపోయిన పంజాబ్ జట్టు, ఈసారి టైటిల్‌పై కన్నేసింది. గత సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఫైనల్ వరకు చేరినా, చివర్లో బెంగళూరు చేతిలో ఓటమి పాలైంది. దీంతో ఈసారి తప్పకుండా కప్ గెలవాలని జట్టు పట్టుదలతో ఉంది. బ్యాటింగ్‌లో మార్కో యాన్సన్, మార్కస్ స్టోయినిస్, అజ్మతుల్లా, కూపర్ కనోలి వంటి విదేశీ ఆటగాళ్లు బలంగా నిలుస్తుండగా, ప్రభు సిమ్రాన్ సింగ్, ప్రియాంష్ ఆర్య వంటి లోకల్ ప్లేయర్లు మంచి ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో ఫెర్గుసన్, అర్ష్ దీప్ సింగ్, చాహల్ వంటి వారు జట్టుకు బలం. అయితే అనుభవం లేని యువ ఆటగాళ్లు కీలక సమయాల్లో తడబడటం, స్పిన్ విభాగంలో లోటు జట్టుకు బలహీనతలుగా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో పంజాబ్ ఈసారి గట్టి పోటీ ఇవ్వగలదని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## సన్‌రైజర్స్‌కు షాక్‌ల పరంపర..

**బౌలింగ్‌లో భారీ ఆందోళన**

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్‌లో బలమైన జట్టుగా గుర్తింపు పొందిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి అనూహ్య సమస్యలను ఎదుర్కొంటోంది. బ్యాటింగ్ విభాగంలో అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి వంటి ఆటగాళ్లతో జట్టు దూసుకుపోయే సామర్థ్యం ఉన్నప్పటికీ, బౌలింగ్‌లో మాత్రం తీవ్ర బలహీనతలు బయటపడుతున్నాయి. జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ భుజం గాయం కారణంగా ప్రారంభ మ్యాచ్‌లకు దూరమవడం పెద్ద ఎదురుదెబ్బగా మారింది. అతని గైర్హాజరీలో ఇషాన్ కిషన్ నాయకత్వ బాధ్యతలు చేపట్టనున్నాడు. మరోవైపు కమిన్స్‌కు ప్రత్యామ్నాయంగా భావించిన జాక్ ఎడ్వర్డ్స్ గాయంతో టోర్నీ నుంచి తప్పుకోవడం జట్టుకు మరింత షాక్ ఇచ్చింది. ఇషాన్ మలింగ కూడా గాయంతో దూరమవడంతో బౌలింగ్ విభాగం మరింత బలహీనపడింది. ఫ్లాట్ పిచ్‌లపై అనుభవం లేని బౌలర్లతో ఆడాల్సి రావడం హైదరాబాద్‌కు పెద్ద సవాల్‌గా మారింది. బ్యాటింగ్ బలం ఉన్నప్పటికీ, బౌలింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే జట్టుకు కష్టాలు తప్పవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు మేనేజ్మెంట్ తీసుకునే నిర్ణయాలే జట్టు భవితవ్యాన్ని నిర్ణయించనున్నాయి.



## విరాట్‌ను తొలగించాలన్న ప్రతిపాదన.. ధోని నమ్మకంతో మారిన కథ

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కెరీర్ ప్రారంభంలోనే జట్టు నుంచి తొలగించాలన్న ఆలోచన వచ్చినట్టు మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ వెల్లడించారు. ఆ సమయంలో కోహ్లీ ప్రవర్తన, ఫామ్‌పై సందేహాలు వ్యక్తమయ్యాయని చెప్పారు. అయితే అప్పటి కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని మాత్రం కోహ్లీపై పూర్తి నమ్మకం ఉంచాడని తెలిపారు. “విరాట్ సాధారణ ఆటగాడు కాదు.. అతడు మ్యాచ్‌ను మలుపుతిప్పగలడు” అంటూ అతడిని జట్టులో కొనసాగించాలని ధోని స్పష్టం చేసినట్టు వివరించారు. ధోని నమ్మకాన్ని నిలబెట్టుకున్న కోహ్లీ, ఆ తర్వాత వరుసగా అద్భుత ప్రదర్శనలు చేస్తూ ‘రన్ మెషిన్’గా ఎదిగాడు. ప్రస్తుతం పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు.



## ధోని ఎల్లో జెర్సీ వేసేది ఇదే చివరి సారి.. ఎందుకంటే?

జాతీయ మీడియాలో కూడా ధోని రిటర్మెంట్ కు సంబంధించిన వార్త ఒకటి విపరీతంగా ప్రచారంలో ఉంది. అయితే ఇందులో చేసిన విశ్లేషణ మాత్రం వాస్తవానికి దగ్గరగా ఉంది. ప్రస్తుతం ధోనీ వయసు 40+.. ఇంతటి వయసులో క్రికెట్ ఆడటం అంత సులభం కాదు. అది కూడా టి20 ఫార్మాట్ ఆడటం అంత ఈజీ కాదు. పైగా ధోనికి అనారోగ్య సమస్యలు ఉన్నాయి. వెన్నెముక నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. గత సీజన్లోనే అతడు వికెట్ల మధ్య పరుగులు తీయడానికి ఇబ్బంది పడ్డాడు. దీంతో ధోని రిటైర్మెంట్ తప్పదని వార్తలు వచ్చాయి. అయితే దీనిపై ధోని పరోక్షంగా స్పందించాడు. తాను స్ట్రెచర్ మీద ఉన్నప్పటికీ కూడా చెన్నై యాజమాన్యం తీసుకొచ్చి.. క్రికెట్ ఆడిస్తుందని చమత్కరించాడు. ఇప్పుడు ధోని 8 లేదా 9వ స్థానంలో బ్యాటింగ్ కు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. గైక్వాడ్ పూర్తి ఫిట్ గా ఉన్నాడు. అతడు ఈసారి జట్టును అత్యంత సమర్థవంతంగా నడిపించాలని బలమైన నిర్ణయంతో ఉన్నాడు. ప్లేయర్లు కూడా అదే స్థాయిలో కృత నిశ్చయంతో ఉండడంతో ఈసారి చెన్నై జట్టు ప్రత్యర్థులకు బలమైన పోటీ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. అయితే తనకు 40 కి మించిన వయసు ఉండడంతో ధోని ఇదే తన చివరి సీజన్ అని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. దీనిపై కొన్ని జాతీయ మీడియా సంస్థలు వార్తలను ప్రసారం చేస్తున్నాయి. అయితే ఇంతవరకు ఈ విషయంపై ధోని అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
22.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



మద్యం : అవసరమైతే పూర్తిగా మానేయండి

శరీరం మీద ప్రభావాలు కనిపిస్తే పూర్తిగా మద్యం మానేయడం ఉత్తమ నిర్ణయం.






# శంభాల దర్శకుడితో సందీప్ కిషన్ కొత్త పాన్ ఇండియా చిత్రం



'శంభాల' చిత్రంతో విజయాన్ని అందుకున్న దర్శకుడు యుగంధర్ ముని మరో కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఈ సారి హీరో సందీప్ కిషన్‌తో కలిసి భారీ స్థాయిలో పాన్ ఇండియా సోషియో ఫాంటసీ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు వెల్లడించారు. నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. చిత్ర ప్రకటన సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. యుద్ధభూమి వాతావరణంలో సింహం, తోడేలు మధ్య ఒక పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ నిలిచి ఉండేలా పోస్టర్‌ను రూపొందించారు. 'కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు.. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు' అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన ఈ పోస్టర్‌కు మంచి స్పందన లభిస్తోంది.

ఈ సోషియో ఫాంటసీ థ్రిల్లర్ ద్వారా ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లేలా కథను రూపొందిస్తున్నారు. దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ కలిసి చేస్తున్న రెండో చిత్రం ఇదే. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా సందీప్ కిషన్ కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని చిత్ర బృందం తెలిపింది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి. రెగ్యులర్ షూటింగ్‌ను 2026 ఆగస్టులో ప్రారంభించనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు.



# వైట్ డ్రెస్‌లో వామిక గబ్బి గ్లామర్ షో

వైట్ కలర్ పొట్టి డ్రెస్‌లో నటి వామిక గబ్బి సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది. బాలనటిగా 'జబ్ వి మెట్' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన వామిక గబ్బి, ఇప్పటివరకు ప్రధానంగా హిందీ సినిమాల్లోనే నటించింది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో లైట్ క్రీమ్ కలర్ పొట్టి డ్రెస్‌లో స్టైలిష్‌గా పోజులు ఇస్తూ తీసుకున్న ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల నుంచి పెద్ద ఎత్తున స్పందన పొందుతున్నాయి.ప్రస్తుతం వామిక గబ్బి అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'భూత్ బంగ్లా' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నట్లు తెలుస్తోంది.




# రణబాలి సినిమాలో రష్మిక పాత్రపై ఆసక్తి

యువ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందాన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రణబాలి' సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. రాయలసీమ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం నుంచి విడుదలైన సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాలో రష్మిక వేశ్య పాత్రలో కనిపించబోతుందన్న వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఆమె పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలు మాత్రం ఇంకా వెల్లడించలేదు. మరోవైపు విజయ్ దేవరకొండ విప్లవకారుడిగా కనిపించనున్నట్లు సమాచారం. ఈ సినిమా నిజ సంఘటనల ఆధారంగా ఉందా లేదా ఫిక్షన్ కథనా అన్నది తెలియాలంటే రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే. 'రణబాలి'తో పాటు విజయ్ 'రౌడీ జనార్ధన్' సినిమాలో కూడా నటిస్తున్నాడు. ఈ సినిమాలు విజయ్‌కు మళ్లీ సక్సెస్‌ను తెస్తాయా అన్నది ఆసక్తికరంగా మారింది.



# నాగార్జున సూపర్ హిట్ సినిమాను రీమేక్ చేయబోతున్న నాగ చైతన్య

నాగార్జున ఒకప్పుడు చేసిన సూపర్ హిట్ సినిమాని ఇప్పుడు నాగచైతన్య రీమేక్ చేయబోతున్నాడు అంటూ కొన్ని వార్తలు కూడా వస్తున్నాయి... ఇవివి సత్యనారాయణ దర్శకత్వంలో చేసిన హలో బ్రదర్ సినిమాని ప్రస్తుతం నాగ చైతన్య రీమేక్ చేయాలని చూస్తున్నారట. అందులో కామెడీ ఎమోషన్ చాలా బాగా ఉంటుందని దానిని అనిల్ రావిపూడి లాంటి దర్శకుడు అయితే రీరైట్ చేసి బాగా హ్యాండిల్ చేయగలడనే ఉద్దేశ్యంతో నాగ చైతన్య ఉన్నాడు. నాగార్జున సైతం దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అనిల్ రావిపూడి ఇప్పుడు చాలా బిజీగా ఉన్నాడు. మరి ఆ బిజీలో నాగచైతన్యతో సినిమా చేసే అవకాశం ఉందా? లేదా అనే వార్తలు కూడా వస్తున్నాయి. నాగచైతన్య మాత్రం ఎప్పటికైనా ఆ సినిమాని రీమేక్ చేయాలని చూస్తున్నాడట. ఇక ఇది తొందరగా వర్కౌట్ అయితే బాగుంటుందని అక్కినేని అభిమానులు సైతం కోరుకుంటున్నారు... ఈ సినిమా ఎప్పుడూ వర్కౌట్ అవుతుంది. నాగార్జున చేసిన పాత్రలో నాగచైతన్య ఎలా నటిస్తాడు అనేది తెలియాలంటే మరి కొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే...



# ఎర్ర చీరలో అందాల 'సునయన'

దీప్తి సునైనా తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని అద్భుతమైన ఫోటోలను పంచుకుంది. పచ్చని బహిరంగ పొలాల్లో, ఎరుపు రంగు చీరలో ఆమె దేవకన్యలా మెరిసిపోతోంది. ఈ ఫోటోలకు ఆమె జోడించిన ఎమోషనల్ క్యాప్షన్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. "కొంత మనసు ఉంటే కొంత మైకం ఉంటుంది" అంటూ దీప్తి తన మనసులోని భావాలను పంచుకుంది. మొదట డబ్‌స్మాష్ వీడియోల ద్వారా పాపులర్ అయిన దీప్తి, తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ మరియు డ్యాన్స్‌తో అతి తక్కువ కాలంలోనే భారీ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది.2018లో 'కిరాక్ పార్టీ' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది.బిగ్ బాస్ తెలుగు సీజన్ 2లో పాల్గొనడం ఆమె కెరీర్‌లో ఒక పెద్ద మలుపుగా మారింది.'మలుపు', 'విడిపోతే' వంటి మ్యూజిక్ వీడియోలతో యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సాధించి ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ప్రస్తుతం దీప్తి తన వ్లాగ్స్, డ్యాన్స్ వీడియోలు మరియు గ్లామరస్ ఫోటోషూట్స్‌తో నిరంతరం వార్తల్లో నిలుస్తోంది.



# చిరు కోసం ఉస్తాద్ స్పెషల్ షో

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం మార్చ్ 19న విడుదలైంది. ఈ చిత్రానికి పరవాలేదు అనే స్థాయి టాక్ దక్కినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమాకు మంచి కలెక్షన్లు వస్తున్నాయి. తాజాగా ఈ సినిమాను మూవీ బృందంతో కలిసి మెగాస్టార్ చిరంజీవి మరియు ఆయన సతీమణి సురేఖ ప్రత్యేక షోలో వీక్షించారు. మూవీ మేకర్స్ ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక ప్రదర్శనకు పవన్ కళ్యాణ్, ఆయన భార్య అన్నా లెజినోవా, ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన శ్రీలీల, దర్శకుడు హరీష్ శంకర్, నిర్మాతలు నవీన్, రవి, దర్శకుడు అనిల్ రావిపూడి తదితర సెలబ్రిటీలు కూడా హాజరయ్యారు. సినిమా చూస్తున్న సమయంలో సెలబ్రిటీలు ఇచ్చిన రియాక్షన్స్‌ను క్యాప్చర్ చేసి మూవీ మేకర్స్ ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో కొన్ని సంవత్సరాల క్రితం వచ్చిన 'గబ్బర్ సింగ్' చిత్రం భారీ విజయాన్ని అందుకుంది. దీంతో మొదటి నుంచే 'ఉస్తాద్ భగత్ సింగ్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మరి టోటల్ రన్ పూర్తయ్యేసరికి ఈ చిత్రం ఎన్ని వసూళ్లు సాధించి ఏ స్థాయి విజయాన్ని అందుకుంటుందో చూడాలి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, తమన్ నేపథ్య సంగీతాన్ని సమకూర్చారు. ఈ చిత్రంలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటించారు.



భూమి పెడ్నేకర్

# ఇక్కడ నిలబడాలంటే ఫిజికల్ ఛేంజెస్ తప్పవు:

ఇండస్ట్రీలో నిలబడాలంటే పాత్రల కోసం ఫిజికల్ ఛేంజెస్ తప్పవని బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ తెలిపింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణానికి సంబంధించిన అనుభవాలను పంచుకుంది. దశాబ్ద కాలంగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న తన కెరీర్‌లో పాత్రల కోసం అనేక శారీరక మార్పులు చేసుకోవాల్సి వచ్చిందని, వాటి వల్ల కొన్ని సమస్యలు ఎదుర్కొన్నట్లు పేర్కొంది. తన కెరీర్‌లో 'ది లేడీ కిల్లర్' చిత్రం వైఫల్యం వ్యక్తిగతంగా, వృత్తిపరంగా తీవ్ర ప్రభావం చూపిందని వెల్లడించింది. మొదట ఇచ్చిన స్క్రిప్ట్‌లో తన పాత్ర పూర్తి స్థాయిలో ఉన్నప్పటికీ, చిత్రీకరణలో కొన్ని ముఖ్య భాగాలు తీసేయడంతో సినిమా అసంపూర్తిగా విడుదలైందని తెలిపింది. ఈ విషయం ముందే తెలిసి ఉంటే మేకింగ్‌లో భాగమై కొన్ని మార్పులు సూచించేదాన్నని చెప్పింది. ఈ ఘటన తనకు ఒక గుణపాఠంగా మారిందని పేర్కొంది. ప్రస్తుతం భూమి పెడ్నేకర్ 'అధూరే హమ్ అధూరే తుమ్' చిత్రంలో నటిస్తోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com